# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, జనవరి 01, 2025 | సంపుటి - 20 | సంచిక 94 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## సమిష్టి కృషితో వికసిత భారత్

**కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా మోడీ**



న్యూఢిల్లీ : నూతన సంవత్సరం లోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశిస్తూ.. పోస్టు పెట్టారు. 2లో






# 4న తెలంగాణ కేబినేట్ భేటీ

**తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది.**

## రైతు భరోసా, పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులపై చర్చ

## యాదగిరిగుట్ట బోర్డు నియామకంపైనా చర్చకు అవకాశం

## సిఎం రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో భేటీ



హైదరాబాద్ :

కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు. కొత్త ఏడాది కానుకగా తెలంగాణ ప్రభుత్వం పలు హామీల అమలుకు సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. అందులో భాగంగా జనవరి 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సెక్రటేరియట్ లో సాయంత్రం 4 గంటలకు ఈ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు.

మిగతా 2లో

## సిఎంతో చర్చల్లో రహస్యమేమీ లేదు

**అంతా బహిరంగంగానే సినీ ప్రముఖుల భేటీ**

**కెటిఆర్ వ్యాఖ్యలపై దిల్‌రాజ్ ఆవేదన**



2

## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

**అప్పుడే ఏర్పాట్లు చేపట్టిన ఆర్టీసీ**



2

హైదరాబాద్ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. హైదరాబాద్ నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రత్యేక బస్సులను నడుపనుంది.

# ప్రజా పాలనలో అంతా మంచే చేస్తున్నాం

## నల్లగొండ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సమీక్ష

## ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌తో 4 లక్షల ఎకరాలకు నీరు

## దశాబ్దాల కలను నెరవేర్చడంలో అశ్రద్ధ వద్దు

## అధికారులకు సూచించిన మంత్రి కోమటిరెడ్డి

**తెలంగాణకు 2024లో చాలా మంచి జరిగిందని.. ప్రజాపాలనలో ప్రజలకు మంచి చేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖలో పూర్తి పారదర్శకత విధానాలు అమలు చేస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు.**



హైదరాబాద్ :

నల్గొండ లోకసభ స్థానం పరిధిలోని నీటి పారుదల ప్రాజెక్టులపై జలసౌధలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఇంజినీర్లు ఈ సమీక్ష లో పాల్గొన్నారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ 4 లక్షల ఎకరాలకు నీళ్లిచే ప్రాజెక్ట్ అని, ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణవెల్లాంల నాకు ప్రథమ ప్రాధాన్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని, కాంట్రాక్టర్ పని చేయకపోతే మంత్రిరికి చెప్పాలన్నారు. నల్గొండ ప్రజల దశబ్దాల కల ఎస్ఎల్‌బిసి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..దయచేసి అధికారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయకండని ఆయన సూచించారు. సీరియస్‌గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చన్నారు. ఎస్ఎల్‌బిసి ఒక వరల్డ్ వండర్.. అది పూర్తయితే.. ప్రపంచమంతా వచ్చి చూస్తుందని, చాలా భాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మా బ్రదర్ 26 బోర్లు వేసినా నీళ్లు రాలేక పంట వదిలేశారు.. నల్గొండ అంత విపత్కర పరిస్థితిలో ఉందని, ముఖ్యమంత్రి , ఇరిగేషన్ మంత్రి , డిప్యూటీ సీఎం అందరూ సపోర్ట్ చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. 2లో

## ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ

### తీర్పు ఇచ్చే వరకు కెటిఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

### మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు



హైదరాబాద్ : ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా .. ఈనెల 30 వరకు అరెస్టు చేయొద్దని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణ 31కి వాయిదా పడింది. తాజాగా ఇరు వైపులా వాదనలు ముగియగా.. కేటీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చే వరకు అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది. 2లో

## డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో సినీతారలు

**ఆలోచింప చేసేలా ప్రభాస్ సందేశం**

హైదరాబాద్ : డ్రగ్స్‌పై సినీతారలు స్పందించా లన్న ఇసెం సూచన మేరకు పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ అవగాహన వీడియో ఇపుడు ఆలోచింపజేస్తుంది. మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ రెబల్ స్టార్ ప్రభాస్ ఇచ్చిన సందేశం ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

2



# కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ పూర్తి కాలే

## మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ :

కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తిగా నిర్మాణం చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి... నామమాత్రం ఆయకట్టు మాత్రమే చేశారని చెప్పారు. ప్రాజెక్టులపై ఆయన జలసౌధలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ..పాలమూరు రూ.27వేలు, సీతారామ ప్రాజెక్టు రూ.8వేలు ఖర్చు చేసి ఒక్క ఎకరా ఆయకట్టు కూడా ఇవ్వలేదన్నారు. 800 టీఎంసీల తెలంగాణకు 299 టీఎంసీ, ఆంధ్రాకు 519 టీఎంసీ గతంలో ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 500 టీఎంసీ నీళ్ల కోసం సర్కార్ చేస్తోందని చెప్పారు. సమక్క సారలమ్మ 44 టీఎంసీలు త్వరలోనే క్లియర్ కాబోతున్నాయన్నారు..

మిగతా 2లో

# రైతు భరోసాపై ఇంకా నిర్ణయించలేదు

## విధివిధానాలపై చర్చిస్తున్నాం: మంత్రి తుమ్మల

ఖమ్మం : రైతు భరోసా మీద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మీద ఎలాంటి నిబంధనలు కానీ పంట వేయనటువంటి రైతులను తగ్గిం చటం కోసం చేసే ప్రయత్నం కానీ తమ ప్రభుత్వం ఇంత వరకు ఏ విధమైన ఆలోచన చేయలేదని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీ కేవలం విధి విధానాల మీద చర్చిం చడం మాత్రమే చేశామన్నారు. సత్తుపల్లి శివారు వ్యవ సాయ క్షేత్రం లో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాలనలో మిగతా 2లో



# 4న తెలంగాణ కేబినేట్ భేటీ

కేబినెట్ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, బీసీ రిజర్వేషన్ లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల సాయం మొదలైన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే రైతు భరోసా, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అసెంబ్లీలో చర్చించిన విషయం తెలిసిందే. సంక్రాతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇటీవల ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కేబినెట్ భేటీ జరిగింది. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, భూభారతి, నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం తదితర అంశాలపై ఉపసంఘం సమావేశంలో చర్చించారు. మంత్రి వర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలను కేబినెట్ కు సిఫారసు చేశారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సబ్ కేబినెట్ లో చర్చించిన అంశాలను అభిప్రా యాలను జనవరి 4న జరగబోయే కేబినెట్ పరిగణనలోకి తీసుకోనుంది. ఉపసంఘం సిఫారసుల ఆదారంగా చర్చించి ఈ అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పేందుకు మరికొన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. జనవరి నాలుగున రాష్ట్ర ప్రజలకు దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయనుంది.

## సమిష్టి కృషితో వికసిత భారత్

ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను గురించి వివరిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు. 'సమష్టిగా ప్రయత్నించి.. 2024లో అనేక విజయాలు అందుకున్నాం. 2025లో మరింత కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ కలను సాకారం చేసుకుందాం' అని మోదీ పేర్కొన్నారు. దీనితో పాటు ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. ఈ వీడియో ఒక ఏడాది కాలంలో సాధించిన పురోగతి, ఐక్యత, వికసిత్ భారత్ వైపు వేసిన అడుగులను గుర్తుచేస్తుందన్నారు.

## ప్రజా పాలనలో అంతా మంచే చేస్తున్నాం

అమెరికా ఇంజనీర్లతో కలిసి పనుల్ని వేగవంతం చేయండని, ప్రాజెక్ట్ కోసం ఏం కావాలన్నా చేసే మంత్రిగా నేనున్నానన్నారు. చిన్న చిన్న సమస్యలతో పనులు ఆపడంపై సీరియస్ అయిన మంత్రి కోమటిరెడ్డి.. ఎంత ఆలస్యం అయితే అంత ఖర్చులు పెరుగుతాయన్నారు. అమెరికన్ ఇంజినీర్లు ఆనాడు మిషన్ అమర్చిన రోజు 3 మూడు రోజులు ప్రాజెక్ట్ దగ్గరే ఉన్నానని, అదిపూర్తి అయితే, ఫర్ షోర్ నుంచి. నీళ్లు తీస్కోవచ్చున్నారు. ఈ ప్రాజెక్టుల విషయంలో నిధుల కొరత రాకుండా చూస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

## కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ పూర్తి కాలే

రాబోయే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో కొత్త ఆయకట్టు తేవాలని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 18వందల లష్కర్‌లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించబోతున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు వచ్చే పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అధికారులు బాధ్యతగా ఉండకపోతే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ ఏఈనీ సస్పెండ్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఏటా ఫీజుల పెంపుతో విద్యార్థులపై భారం

### ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం అజమాయిషీ

### విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

హైదరాబాద్ : ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుందని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రతి ఏడాది ఫీజు పెంచులను కోవడం సమంజసం కాదన్నారు. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలని, ప్రభుత్వానికి తాము సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదని ఆకునూరి మురళీ పేర్కొన్నారు. 'ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుంది. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలి. ఈ విషయమై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాం. ప్రైవేట్ విద్యా సంస్థలను స్ట్రీమ్ లైన్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసంబద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక స్కూల్లో అప్లికేషన్ ఫీజు రూ.4,500గా ఉంది. స్కూల్స్ సేల్స్ యాక్టివిటీ నుండి పూర్తిగా బయటకు రావాలి. ప్రభుత్వం ఆ వైపున చర్యలు తీసుకుంటుంది. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలి' అని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. 'మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో కొన్ని మంచి అంశాలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఫీజు పెంచుకోవాలని అనుకోవడం సమంజసం కాదు. స్కూల్లోకి ఎఫ్డీఐలు కూడా వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి లేక రాస్తాము. స్కూల్లను కేటగిరీలుగా విభజిస్తాం. ఒక వారంలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తాము' అని విద్యా కమిషన్ ఛైర్మన్ తెలిపారు.

## ప్రధాని మోడీ పేరు చెప్పి నిరుద్యోగులకు టోకరా

### కిలాడీ జంటను అరెస్టు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ : రాజకీయ నాయకులు తమకు తెలుసని, వారిని కలిపిస్తామని చెబుతూ అమాయక ప్రజల నుంచి డబ్బులు గుంజేవాళ్ల గురించి మనం చాలా సందర్భాల్లో విన్నాం. కానీ ఓ కిలాడీ జంట మాత్రం అంతకంటే హైప్రొఫైల్ మోసాలకు పాల్పడింది. ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ పేరును అడ్డంపెట్టుకుని కోట్లు కొల్లగొట్టింది. ప్రధాని మోదీ కార్యదర్శి కుటుంబ సభ్యులమని నమ్మించి, కాంట్రాక్టుల పేరుతో అనేక మంది నుంచి కోట్లల్లో కమిషన్‌లు తీసుకుంది. చివరకు బండారం బయటపడటంతో కటకటాలపాలైంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన 38 ఏళ్ల హన్సితా అభిలిప్సా , అనిల్ మొహంతి ఇద్దరూ భార్యాభర్తలు. వీరు భువనేశ్వర్‌లోని ఇన్ఫోసిటీ ప్రాంతంలో ఓ విలాసవంతమైన భవనం అద్దెకు తీసుకుని కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అభిలిప్సా తాను ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి పీకే మిశ్రా కూతురునని చెప్పి పలువురిని పరిచయం చేసుకుంది. అందరినీ నమ్మించేందుకు అనేక మంది రాజకీయ ప్రముఖులతో కలిసి దిగిన ఫొటోలను కార్యాలయంలో పెట్టుకుంది. ఆమె భర్త మొహంతి కూడా తాను మిశ్రా అల్లుడినని పలువురిని నమ్మించాడు. ఈ విధంగా వారు ప్రభుత్వం నుంచి టెండర్లు ఇప్పిస్తామని, ఏవైనా పనులు కావాలన్నా చేసిపెడుతామని ప్రచారం చేసుకున్నారు. వారి మాటలు నమ్మిన వారి నుంచి కమిషన్‌ల పేరుతో కోట్ల రూపాయలు పిండుకున్నారు. అభిలిప్సా.. మై నింగ్, నిర్మాణం, వ్యాపార రంగాలకు చెందిన ధనవంతులను లక్ష్యంగా చేసుకుని వారితో పరిచయాలు పెంచుకుంది. వారి నుంచి కోట్లు వసూలు చేసింది. అయితే కమిషన్ ముట్టజెప్పినా కాంట్రాక్టులు ఇప్పించకపోవడంతో వారిపై ఈ నెల 26న ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దాంతో కిలాడీ జంట బాగోతం బయటపడింది. పోలీసులు ఆ జంటను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## హైవే రోడ్డుపై కూలిన ఐరన్ బోర్డు

### 50 కార్లకు పైగా పంక్చర్.. భారీగా ట్రాఫిక్ జామ్

ముంబై : మహారాష్ట్రలోని ముంబై-నాగ్‌పూర్ సమృద్ధి మహామార్గ్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మాలేగావ్, వనోజా టోల్ ప్లాజా మధ్య హైవేపై ఓ ఐరన్ బోర్డు విరిగిపడింది. దీంతో సుమారు 50కిపైగా ట్రక్కులు, కార్లు పంచర్ కావడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించకపోవడంతో అర్ధరాత్రి వరకు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సమృద్ధి మహామార్గ్‌ను నాగ్‌పూర్-ముంబై మధ్య నిర్మిస్తున్నారు. మొత్తం 701 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారిని ప్రస్తుత సీఎం ఫడ్నవీస్ కలల ప్రాజెక్టుగా పేర్కొంటారు. ఇప్పటికే ఈ ఎక్స్‌ప్రెస్ వేలో రెండు దశలు పూర్తయ్యాయి. దీంతో 600 కిలోమీటర్లు అందుబాటులోకి వచ్చినట్లయింది. అయితే డిజైన్ లోపాలతో హైవేపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

## ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ

ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు 6,432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించింది.గతేడాది సంక్రాంతికి 4,484 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక రూపొందించగా.. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో 5,246 బస్సులను నడిపింది. గత సంక్రాంతి అనుభవాల దృష్ట్యా ఈసారి 6,432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. జనవరి 9 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్‌బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేలా ప్రత్యేక అధికారులను ఆర్టీసీ నియమించింది. అమలాపురం, కాకినాడ, కందుకూరు, నర్సాపురం, పోలవరం, రాజమహేంద్రవరం, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుగు పయనమయ్యే వారి కోసం కూడా ప్రత్యేక బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంక్రాంతికి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా ఎ÷-లాన్ చేస్తోంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అమల్లో ఉంటుందని తెలిపింది. ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని వివరించింది. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను చేసుకోవాలని పేర్కొంది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ 040-69440000, 040-23450033 నంబర్లకు సంప్రదించాలని సూచించింది.

## సిఎంతో చర్చల్లో రహస్యమేమీ లేదు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో జరిగిన తెలుగు చిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. సిఎం రేవంత్‌తో జరిగిన సమావేశం అందరికి తెలిసిందేనని అన్నారు. ఇందులో రహస్యం ఏదీ లేదని అంటూ..ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'సీఎంతో జరిగిన సమావేశం ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదు.. అందరికీ తెలిసే జరిగింది. తెలుగు చిత్రపరిశ్రమ బాగోగుల గురించి అత్యంత స్నేహపూర్వకంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశం పట్ల చిత్రపరిశ్రమ చాలా సంతృప్తిగా ఉంది. తెలంగాణ అభివృద్ధి పయనంలో చిత్రపరిశ్రమ భాగస్వామ్యాన్ని గుర్తించి.. రాష్ట్రాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి, మా బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన సంకల్పాన్ని చిత్రపరిశ్రమ ప్రతినిధులుగా మేమందరం స్వాగతించాం. అనవసర వివాదాల్లోకి చిత్ర పరిశ్రమను లాగి, పరిశ్రమకు లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని మా మనవి. రాజకీయ దాడి, ప్రతిదాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దని అందరినీ కోరుతున్నాం. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోన్న చిత్ర పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని ఆశిస్తున్నాం' అని దిల్ రాజు పేర్కొన్నారు. సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ... సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంపై మరోసారి స్పందించారు. కేవలం ప్రచారం కోసం, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సినిమా వాళ్ల గురించి సీఎం రేవంత్ రెడ్డి అలా మాట్లాడారని పేర్కొన్నారు. అటెన్షన్, డైవర్షన్ కోసమే సీఎం పాకులాడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. సినిమా వాళ్లతో సెటిల్ చేసుకొని ఇప్పుడు ఏం మాట్లాడట్లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలపై దిల్ రాజు స్పందించారు.

## కేరళ నర్సుకు దక్కని ఊరట

### వ్యక్తిని హత్య చేసిన కేసులో ఉరిశిక్ష

### క్షమాభిక్షను తిరస్కరించిన ఆ దేశ అధ్యక్షుడు

న్యూఢిల్లీ : యెమెన్ దేశంలో అక్కడి వ్యక్తిని హత్య చేసిన కేసులో దోషిగా తేలి ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియకు ఆ దేశ అధ్యక్షుడి కరుణ దక్కలేదు. ఆమె పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను యెమెన్ అధ్యక్షుడు రషద్ అల్-అలిమి తిరస్కరించారు. దాంతో ఆమెకు మరణశిక్షకు అధ్యక్షుడి ఆమోదం లభించినట్లయ్యింది. అయితే నర్సు మరణశిక్షకు ఆమోదం తెలిపిన అధ్యక్షుడు.. ఆ శిక్ష అమలుకు మాత్రం నెల రోజుల గడవు ఇచ్చారు. నిమిషా ప్రియ 2017లో తలాల్ అబ్దో మహదీ అనే యెమెన్ పౌరుడి నుంచి తన పాస్‌పోర్ట్‌ను తీసుకునే క్రమంలో అతడికి మత్తుమందు ఇంజెక్ట్ చేసి హతమార్చినట్లు కేసు నమోదైంది. అనంతరం పోలీసుల విచారణలో ఆమె హత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. దాంతో ట్రయల్ కోర్టు 2018లో నిమిషాకు ఉరిశిక్ష విధించింది. దానిపై నర్సు నిమిషా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. కానీ, సుప్రీంకోర్టు కింది కోర్టు తీర్పునే సమర్థించింది. దాంతో నిమిషా ప్రియ యెమెన్ అధ్యక్షుడిని క్షమాభిక్ష కోరింది. తాజాగా యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. అయితే ఉరిశిక్ష అమలుకు నెల రోజుల సమయం ఇచ్చారు. ఈ పరిణామాలపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. యెమెన్‌లో నిమిషా ప్రియా మరణశిక్ష అంశం తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. శిక్ష నుంచి ప్రియను బయటపడేయటానికి ఆమె కుటుంబం చేస్తున్న ప్రయత్నాలు, పడుతున్న ఆవేదనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొంది. ఈ విషయంలో భారత ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. నిమిషా ప్రియను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్షను తిరస్కరిండం దిగ్భ్రాంతికి గురిచేసిందని జైశ్వాల్ పేర్కొన్నారు. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన నిమిషా ప్రియ ఉపాధి కోసం 2014లో భర్త, కూతురితో కలిసి యెమెన్‌కు వెళ్లారు. ఆర్థిక కారణాలవల్ల భర్త థామస్, కూతురు కొద్ది రోజుల్లోనే స్వదేశానికి వచ్చారు. ప్రియ మాత్రం అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ.. ఏడాది తర్వాత సొంతంగా క్లినిక్ ఏర్పాటు చేసుకోవాలని భావించింది. అందుకోసం తన భర్త స్నేహితుడైన తలాల్ అబ్దో మహదీ సహాయం కోరింది. అక్కడ విదేశీయులు ఏదైనా సొంత వ్యాపారం లేదా సంస్థ ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే లైసెన్స్ పొందాలంటే యెమెన్ జాతీయులు హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆమె తలాల్ సాయం కోరింది. ఈ క్రమంలో నిమిషా ప్రియ పాస్‌పోర్టును తన దగ్గర పెట్టుకున్న తలాల్ అబ్దో.. ఆ తర్వాత దాన్ని తిరిగి ఇచ్చేందుకు ని రాకరించాడు. దాంతో నిమిషా తన పాస్‌పోర్టును తిరిగి తీసుకోవడం కోసం అతడికి మత్తుమందు ఇచ్చి హత్యచేసింది.

## ఐఆర్‌సీటీ మళ్లీ డౌన్

### ఇది నెలలో మూడోసారి.. తీవ్ర అసహనానికి గురైన ప్రయాణికులు

న్యూఢిల్లీ : ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజమ్ కార్పొరేషన్ వెబ్‌సైట్ మరోసారి డౌనయ్యింది. మంగళవారం ఉదయం ఆశ్చర్యకరంగా తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలోనే వెబ్‌సైట్ మొరాయించింది. దాంతో యూజర్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌ను సరిదిద్దే పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల కొంతసేపు టికెట్ బుకింగ్‌లు, కాన్సిలేషన్‌లు చేయడం వీలుపడదని ప్రకటించారు. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ డౌన్ అవడం ఈ నెలలో ఇదే తొలిసారి కాదు. ఇప్పటికే రెండు సార్లు ఈ సమస్య వచ్చింది. తాజాగా మూడోసారి సమస్య తలెత్తింది. డిసెంబర్ 26న ఏకంగా గంటన్నర పాటు బుకింగ్స్ నిలిచిపోయాయి. అంతకు ముందు డిసెంబర్ 9న కూడా వెబ్‌సైట్ రెండు గంటలపాటు సతాయించింది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా టూర్ ప్లాన్ చేసుకున్నవాళ్లు టికెట్ బుక్ చేసుకుందామంటే సమస్య తలెత్తింది. వెబ్‌సైట్ ట్రాకర్ డౌన్ డిటెక్టర్ ప్రకారం దాదాపు 47 శాతం మందికి వెబ్‌సైట్ యాక్సెస్ కాలేదు. 42 శాతం మందికి యాప్ ఓపెన్ కాలేదు. 10 శాతం మంది టికెట్ బుకింగ్ చేసుకోలేకపోయారు. ఉదయం 10 గంటల నుంచి యూజర్లు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దీనిపై రైల్వేశాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గతంలో రెండుసార్లు సైట్ డౌన్ అయినప్పుడు కూడా రైల్వే శాఖ ఎలాంటి స్పందన తెలుపలేదు. కాగా ఈ నెలలో మూడు సందర్భాల్లోనూ తత్కాల్ టికెట్లు ప్రారంభం కావడానికి సరిగ్గా 10 నిమిషాల ముందే ఉదయం 9.50 గంటలకు సైట్ డౌన్ కావడం గమనార్హం.

## డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో సినీతారలు

'లైఫ్‌లో మనకి బోలెడన్నీ ఎంజాయ్ మెంట్స్ ఉన్నాయి.. కావలసినంత వినోదం ఉంది.. మనల్ని ప్రేమించే మనుషులు.. మన కోసం బ్రతికే మనవాళ్ళు మనకి ఉన్నప్పుడు.. ఈ డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్?.. ఈరోజు నుండి డ్రగ్స్ కి గుడ్ బై చెప్పండి.. మీకు తెలిసిన వారెవరైనా డ్రగ్స్ కి బానిసలైతే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగలరు'అంటూ ప్రభాస్ తెలిపారు. అయితే, డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ మహా కార్యంలో టాలీవుడ్ హీరోలు, హీరోయిన్స్ తమ సందేశాలను వీడియోల ద్వారా తెలుపుతున్నారు. అయితే, మరికొన్ని గంటల్లో 2024కు ఎండ్ కార్డ్ పడనుంది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అందరిలో ఉత్సాహం మొదలైంది. ఈ క్రమంలో ప్రభుత్వం, పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎందుకంటే, తాగి నడుపుతూ ప్రమాదాలు, డ్రగ్స్ తీసుకుని అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయి. కనుకే, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, నడుచుకోవాలని జాగ్రత్త చెబుతూ.. హెచ్చరిస్తున్నారు.

## రైతు భరోసాపై ఇంకా నిర్ణయించలేదు

రూ. 21 వేల కోట్ల రుణామాఫీ, రూ.7,625 వేల కోట్ల రైతు బంధు, రూ. 3 వేల కోట్ల రైతు భీమా ఇచ్చిందని ప్రకటించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చామని స్పష్టం చేశారు. పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలనేదే స్థూలంగా తమ ప్రభుత్వం ఆలోచన అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిమిషం వరకు రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం చేయనటువంటి ప్రభుత్వంపై ప్రసార సాధనాల ద్వారా కానీ ప్రతి పక్షాలు దుష్ప్రచార చేసే ఆలోచన చేయొద్దని తెలిపారు. రైతు భరోసాపై తాము చేసిన చర్చల ఫలితాలను కేబినెట్‌లో పెడతామని అన్నారు. రైతు భరోసాపై కేబినెట్ నిర్ణయమే తుది నిర్ణయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## కొండాపూర్ అపార్ట్‌మెంటులో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో మంగళవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజరాజేశ్వరీ కాలనీ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోని 9వ అంతస్తులో ఉన్న ఎ÷-లాట్‌లో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో ప్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండాపూర్‌లోని గేలక్సీ అపార్ట్‌మెంట్స్ 9వ అంతస్తులో మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. మహిళ బాల్కనీలో ఉండటంతో ప్రమాదం తప్పింది ఇంట్లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎగిసిపడుతున్న మంటలను చూసి భయభ్రాంతులకు గురై ఇంట్లో ఉన్నవారు కిందకు వచ్చేశారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. . ఘటనస్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లోని బాలాపూర్ పరిధిలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. బిస్మిల్లా కాలనీలోని ప్లాస్టిక్ గోదాంలో మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. ఘటనస్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళలనకు గురయ్యారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. పక్కనున్న వారిని అక్కడ నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు.

## కేటిఆర్‌ను ఓ రెండు రోజులు ఎంజాయ్ చేయనీయండి

### కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికర వ్యంగ్య వ్యాఖ్యలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికర వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ రెండు రోజులు ఎంజాయ్ చేయనివ్వండి అని అన్నారు. కొత్త సంవత్సరం రోజు కేటీఆర్‌ను బాధ పెట్టకండి అని చెప్పారు. న్యూ ఇయర్ రోజు ఎంజాయ్ చేయనీయాలని అన్నారు. కేటీఆర్ గురించి 3, 4 వ తేదీల్లో చూద్దామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. జలసౌధలో మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ పార్లమెంటు పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నల్గొండ ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్‌బీసీప్రాజెక్ట్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని హెచ్చరించారు. కాంట్రాక్టర్ పని చేయకపోతే సంబంధిత మంత్రికి చెప్పాలన్నారు. దయచేసి అధికారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయొద్దని వార్నింగ్ ఇచ్చారు. అధికారులు సీరియస్‌గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చని చెప్పారు. నల్గొండను రాబోయే నాలుగేళ్లలో ఉభయ గోదావరి జిల్లాలను మించి సస్య శ్యామలం చేస్తామని అన్నారు. ఆంధ్ర పాలకులే నల్గొండకు న్యాయం చేశారని చెప్పారు. పదేళ్లు నల్గొండ జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. వేముల ప్రశాంత్ రెడ్డి ఫామ్ హౌస్‌కు, ప్రగతి భవన్‌కు మంత్రిగా పనిచేశారని విమర్శించారు. ఆయనకు రోడ్ల గురించి ఏం తెలుసు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు.

# సమ్మర్ సీజన్ లోపు ఒక వైపు పెద్దపల్లి కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బీ) సిద్దం

### పెండింగ్ భూ సేకరణ డిమాండ్ నోటీస్ వెంటనే జారీ చేయాలి - పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బీ పనులు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)** రాబోయే సమ్మర్ సీజన్ లోపు పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఒక వైపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 119 కోట్ల 50 లక్షల వ్యయంతో పెద్దపల్లి కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బీ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పెండింగ్ భూ సేకరణ డిమాండ్ నోటీస్ జనరేట్ చేసి ఆర్ అండ్ బి అధికారులకు అప్పగించాలని కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, వచ్చే సమ్మర్ సీజన్ లోపు కనీసం ఒకవైపు ఆర్.ఓ.బీ పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన సర్వీస్ రోడ్డు పనులు సమాంతరంగా జరగాలని, వీటిని సమ్మర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ %ఉ%బీ భావ్ సింగ్, తహసిల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర శిక్షణ ఉద్యోగులపై
# కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్యసాధింపు

- ఉద్యోగాలు రెగ్యులర్ చేసేవరకు అండగా ఉంటాం
- సమగ్ర శిక్షణ ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలిపిన బిజెపి నేత సోమరపు లావణ్య



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు అందరిని రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్నిరోజులుగా సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సోమారపు లావణ్య ప్రకటించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యాశాఖ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సమగ్ర శిఖ్షణ అభియానులో భాగంగా భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయ్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారని తెలిపారు. ఇందుకోసం ఆయా రాష్ట్రాలకు ఉద్యోగులను నియమించుకునే వెసులుబాటును కల్పించారని గుర్తు చేశారు. అయితే చాలాకాలంగా కాంట్రాక్టు ఉద్యోగులతో నెట్టుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు వారిని రెగ్యులరైజ్ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయని దుయ్యబట్టారు. క్రితం ఏడాది ఎన్నికల ప్రచార సభల్లో సమగ్ర శిక్షణలో ఉన్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేస్తామని ఊదరగొట్టిన ప్రస్తుత ముఖ్యమంత్రికి నెలరోజులుగా చేస్తున్న ఆందోళన కనిపించడం లేదా అని నిలదీశారు. ఉద్యమంలో పాల్గొంటున్న ఉద్యోగులను బెదిరింపులకు గురిచేయడం సిగ్గుచేటని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చేస్తున ఉద్యోగుల పట్ల కక్ష్యసాధింపు ధోరణిని విడనాడాలని హితవు పలికారు. పనికి సరిపడా వేతనం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని లావణ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమగ్ర శిక్షణ ఉద్యోగులతో కలిసి భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతమాని ఆమె హెచ్చరించారు.

# రామగుండం నగర పాలక సంస్థ ఉన్నట్టా లేనట్టా

- లక్షల రూపాయలతో ఫ్రీజర్లను, వాహనాలను కొనుగోలు చేయడం మూలన పడేయడం అల్వాటుగా మారింది
- పరిశుద్ధ్య కార్మికుల బెల్లం ఇవ్వకుండా అసాంఘిక శక్తులకు సరఫరా చేస్తున్నారా
- కార్పొరేషన్ కార్యాలయం లో ఫ్రీజర్లుకు, వాహనాలకు పూజ చేసి నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపిన స్వచ్ఛంధ సంఘాల ఐక్య వేదిక



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్)** రామగుండం నగరపాలక సంస్థ కేవలం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగానే ఉంది తప్ప ఎలాంటి అభివృద్ధి చేయని నగరపాలక సంస్థ ఉన్నా లేనట్లే అని లక్షల రూపాయలతో ఫ్రీజర్లు, వాహనాలు కొనుగోలు చేసి మూలన పడేయడం పట్ల స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు నేడు కార్పొరేషన్ కార్యాలయంలో మూలన పడేసిన డెడ్ బాడీ ఫ్రీజర్లకు నూతనంగా కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు ట్రాక్టర్లకు వినూత్నంగా నల్ల బ్యాడ్జీలతో పూజలు చేసి హారతి ఇచ్చి వినూత్నంగా నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం స్వచ్ఛంధ సంఘాల ఐక్య వేదిక అధ్యకులు మంచీకట్ల దయాకర్, మద్దెల దినేష్ లు మాట్లాడుతు గత కొన్ని సంవత్సరాల క్రింద రామగుండం నగరపాలక సంస్థ ఐఎస్ కమిషనర్ ఉన్నప్పుడు వైకుంఠ రధాలు వాహనాలు వాటితో పాటు ఫ్రీజర్లును నాడు ప్రజా పోరాటాలు చేసి నగరపాలక సంస్థ ద్వారా కొనుగోలు చేపించడం జరిగిందన్నారు. వైకుంఠ రథాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్రీజర్లు మాత్రం ఒక మూలన పడేసి వాటిని పట్టించుకునే వారే కరువైనారని అనేకసార్లు కమిషనర్ దృష్టికి పరిశుద్ధ విభాగం అధికారులకు ఇన్చార్జి కమిషనర్ లకు ఫిర్యాదు చేసిన ఇప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. గోదావరిఖని ప్రాంతంలో వివిధ పరిశ్రమలలో కూలి నాలి చేసుకొని దురదృష్టశాత్తు ఎవరైనా మృతి చెందితే కనీస ఫ్రీజర్ లేని పరిస్థితి ఏర్పడుతుందని ఒకవేళ ఫ్రీజర్ ప్రైవేట్ సంస్థల ద్వారా కిరాయి తెచ్చుకుంటే రెండు నుంచి నాలుగు వేల వరకు ఆర్థిక భారం పడుతుందని, అదే మున్సిపల్ లో ఉన్నటువంటి ఫ్రీజర్లు తీసుకెళ్తే ఉచితంగా ప్రజలకు అందుతుంది కదా అని కొనుగోలు చేపిస్తే వాటిని మరమ్మత్తులు చేయకుండా శిథిలావస్థకు చేరే విధంగా చేయడం దురదృష్టకరమని వారన్నారు ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశుద్ధ్య విభాగానికి సంబంధించి వివిధ రకాల వాహనాలు ట్రాక్టర్లు గాని ఆటో ట్రాలీలు గాని పూర్తిగా మరమ్మత్తులకు నోచుకోకుండా వాటి లైఫ్ సర్వీస్ అయిపోయినాయి కానీ డ్రైవర్లతో వాటిని నడిపిస్తూ డ్రైవర్లకు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని మా వంతుగా పోరాటాలు చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని దానితో సంబంధించిన శాఖ అధికారులు స్పందించి నూతన వాహనాలు ట్రాక్టర్లు ట్రాలీలు కొనుగోలు చేసి అలంకారణప్రయంగా పెట్టారు తప్ప ఇంతవరకు వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి ఒకవైపు చెడిపోయిన ట్రాక్టర్లు తో డ్రైవర్లు అన్ని రకాలుగా శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి ఫ్రీజర్లు నూతనంగా కొలుగోలు చేసిన వాహనాలు వినియోగంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా గత మూడు సంవత్సరాల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి బట్టలు చెప్పులు బెల్లం చీపురు కట్టలు ఇంకా ఇతరత్రా వారి పనిముట్లు సామాగ్రి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారని బెల్లం కొంతమంది గుడుంబా విక్రయించే వారితో కుమ్మక్కైనారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వాటిని కార్యాలయం నుండి ఇతర అసాంఘిక శక్తులకు సాగనంపడం దురదృష్టకరమని పారిశుద్ధ కార్మికులకు బెల్లం ఇవ్వకుండా పూర్తీగా చెడి పోయిందని పడేస్తున్నారా లేక కుటుంబాలు తయారు చేసే మాఫియాలకు అమ్ముకుంటున్నారా అని వారు ప్రశ్నించారు. పారిశుద్ధ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు అవినీతి మత్తులో చూలుతూ వారిని అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని పారిశుద్ధ కార్మికులకు అండగా స్వచ్ఛంధ సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు ఉంటారని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు గోలివాడ చంద్రకళ, సీసిమా, కంది సుజాత, రమా, కొమ్ము చందు యాదవ్, సుద్దాల అణురాజ్, శిరీష, రాజు కుమార్, శంశర్, శ్రీనివాస్ తొ పాటు తదితరుల పాల్గొన్నారు.



# భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలలో
# క్రీడా బహుమతుల ప్రదానోత్సవం...

### 2025 క్యాలెండర్ ఆవిష్కరణచేసిన పాఠశాలల చైర్మెన్ బి. రమణరావు....



**కరీంనగర్ టౌన్, డిసెంబర్31(ది క్రైమ్ న్యూస్)** 2024 సంవత్సరానికి ముగింపు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం ఇస్తూ స్థానిక భగవతి,ఆర్విన్ ట్రీ పాఠశాలలో నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాలల చైర్మెన్ బి. రమణరావు ఈ సంవత్సరం క్యాలండర్ను విడుదల చేశారు. అనంతరం రమణరావు క్యాలండర్ యొక్క ప్రత్యేకతను తెలిపారు. అనంతరం గత మూడు రోజులుగా నిర్వహించినటువంటి క్రీడలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఫిట్ ఎక్స్ పో -2024 పేర నిర్వహించిన వివిధ రకాలైన క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల చైర్మెన్ బి. రమణరావు బహుమతులను అందజేశారు. అనంతరం రమణరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలంటే ఎంతో ఇష్టంగా ఉంటుందని అందుకే విద్యార్థుల్లో ఆటలపై మక్కువ పెంచాలనే ఉద్దేశంతో క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించామని అన్నారు. అనంతరం కార్యక్రమంలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన ఏఆర్ ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్...

### ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి



**కరీంనగర్ టౌన్, డిసెంబర్31(ది క్రైమ్ న్యూస్)** కరీంనగర్ కమీషనరేట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో డ్రైవర్ గా పనిచేస్తూ పదవీకాలం ముగిసిన మిర్జా హాసన్ అలీ బేగ్ దాదాపు 42 సంవత్సరాల సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖకు సేవలందించి పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొందుతున్న ఏ.ఆర్.ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్ కి పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. వారికి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణతో పాటుగా రిజర్వు ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి సంక్షేమం, కుమారస్వామి ఎం. టి. ఓ. ఉమ్మడి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడాల సురేందర్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్ పమేలా సత్పతి

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా సందర్శించి ఓపి వద్ద రికార్డులను, ల్యాబ్, పేషెంట్ల గదులను తనిఖీ చేశారు.ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించి స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి 13 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా సాధారణ ప్రసవం జరిగేటట్లు చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వైద్యులు వెంకటరమణ,మండల వైద్యాధికారి వైద్యులు సల్మాన్, వైద్యురాలు సౌమ్య, సిహెచ్ఓ రాజు నాయక్,సూపర్ వైజర్లు జుబేర్,సరోకా,స్నేహలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# వేధింపులకు పాల్పడ్డ ప్రధానోపాధ్యాయుడిని శిక్షించాలి
# డిఈఓకు ఫిర్యాదు చేసిన ఏబివిపి నేతలు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)** విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాలకుర్తి మండల కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డిపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేతలు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబివిపి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం పట్ల ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు దోషుల పట్ల కఠిన వైఖరిని అవలంభించకపోవడమే ఇందుకు కారణమని ఆరోపించారు. విద్యార్థులకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ రాష్ట్ర కోకన్వీనర్ మారం సందీప్, నాయకులు విష్ణు, అరవింద్ తదితరులు ఉన్నారు.

# సంపాదకీయం

## కొత్త సంవత్సరంలో ప్రజల కోసం పనిచేయాలి !

కొత్త సంవత్సరంలో అధికార విపక్షాలు పరస్పర విమర్శలు మాని ఇక ప్రజల కోసం పనిచేయాలి. ప్రజలు లక్ష్యంగా సమస్యలపై పోరాడాలి. నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. లేకుంటే ప్రజల్లో ఇరు పక్షాల పట్ల ఏహ్యాభావం ఏర్పడగలదు. ఇకపోతే రాజకీయంగా 2024 సంవత్సరం కాంగ్రెస్‌కు కలసి రాగా..ప్రధాని మోడీకి మత్రం హెచ్చరిక చేసింది. రెండు పర్యాయాలు అత్యధిక మెజార్టీతో గెలిచిన బిజెపి..మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం బాగా దెబ్బతిని మెజార్టీకి దూరంగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదో హెచ్చరికగా గుర్తించాల్సిన మోడీ..అలా చేయడం లేదు. పాలనలో మార్పు కనిపించడం లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ఇదే ఏడాది కాంగ్రెస్ పార్టీకి కొద్దో గొప్పో కలిసొచ్చిందనే చెప్పాలి. ఎందుకంటే.. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ప్రతిపక్ష హోదాను దక్కించుకొంది. దీంతో లోక్‌సభలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. ఇక కేరళలోని వయనాడ్ లోక్ సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ భారీ మెజార్టీతో గెలుపొందారు. దాంతో ఆమె సైతంపార్లమెంట్ సభ్యురాలిగా తొలిసారిగా లోక్ సభలో అడుగు పెట్టారు. ఇది ఓ రకంగా సోనియా కుటుంబానికి కలిసి వచ్చిన అంశంగా చెప్పుకోవాలి. వారికి పార్టీలో ఇక తిరుగులేదన్న విధంగా పరిస్థితి మారింది. అన్నా చెల్లెళ్లు లోక్‌సభలో, తల్లి సోనియా రాజ్యసభలో ఉన్నారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సారథ్యంలో మోదీ పాలన పగ్గాలు చేపట్టిన నాటి నుంచి వరుసగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో.. అంటే 2019లో సైతం కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాను దక్కించుకోలేదు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ ఆ హోదాను దక్కించుకోవడమే కాకుండా.. ప్రియాంక సైతం ఎంపీగా గెలుపొందారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ.. తమ కుటుంబానికి కంచుకోట అయిన ఉత్తరప్రదేశ్‌లోని అమేథితోపాటు కేరళలోని వయనాడ్ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. అయితే అమేథి నుంచి బీజేపీ అభ్యర్థిగా స్మృతీ ఇరానీ బరిలో నిలిచారు. దీంతో ఈ నియోజకవర్గం ప్రజలు ఆమెకు పట్టం కట్టారు. వయనాడ్ నుంచి రాహుల్ గెలుపొందారు. ఇక 2024 ఎన్నికల పోలింగ్ మొత్తం 7 దశల్లో జరిగింది. దీంతో వయనాడ్ ఎంపీ అభ్యర్థిగా రాహుల్ గాంధీ నామినేషన్ వేశారు. తొలి దశలోనే ఈ నియోజకవర్గం పోలింగ్ జరిగింది. అనంతరం రాయబరేలి నుంచి సైతం పోటీ చేయాలని ఆయనపై పార్టీ ఒత్తిడి తీసుకు వచ్చింది. దీంతో ఆయన ఆ స్థానం నుంచి బరిలో దిగారు. ఇక ఎన్నికల ఫలితాల్లో ఆయన రెండు స్థానాల నుంచి విజయకేతనం ఎగుర వేశారు. అయితే ఈ రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని ఆయన వదులుకోవాల్సి వచ్చింది. దీంతో రాహుల్ గాంధీ వయనాడ్ స్థానాన్ని వదులు కోవాగా, ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దాంతో ఈ స్థానం నుంచి ప్రియాంక గాంధీని కాంగ్రెస్ పార్టీ బరిలో నిలిపింది. ఈ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అలా ఆమె సైతం లోక్ సభలో అడుగు పెట్టారు. అదీకాక.. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొనే ప్రియాంక గాంధీ ఇలా లోక్ సభలో అడుగు పెట్టేందుకు వయనాడ్ వేదికగా మారింది. లోక్ సభలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి మరో గొంతుక ప్రియాంక రూపంలో తోడు అయినట్లు అయింది. మొన్నటి శీతాకాల సమావేశాల్లో ఆమె గట్టిగానే నిలబడ్డారు. తన సత్తా చాటారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా పరాజయం పాలైన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి కాంగ్రెస్ తన ఆందోళనా స్వరాన్ని పెంచింది. ఎన్నికల సమగ్రతకు సంబంధించి చాలా అంశాలున్నాయి. వాటి పట్ల భారత ఎన్నికల సంఘం స్వచ్ఛంగా వుండాల్సిన అవసరముంది. ఇదే సమయంలో ఎన్నికల సంఘం తీరుపై సుప్రీంలో కేసు కూడా దాఖలు చేసింది. ఇ.వి.ఎం లను ఎలక్ట్రానిక్ ట్యాంపరింగ్ చేసే ముప్పు కొనసాగిందన్న వాదనతో కాంగ్రెస్ గొంతెత్తుతోంది. అది కూడా ఎంపిక చేసుకున్న అంశాలపైనే, అందులోనూ ఓడిపోయిన వాటిపైనే మాట్లాడుతోంది. ఇ.వి.ఎం లకు సంబంధించి అవకతవకల ముప్పు వుందని సూచించేలా పరోక్షంగా లేదా ముందుగానే ప్రోగ్రామింగ్ చేయడం ద్వారా ట్యాంపరింగ్ జరిగి వుంటుందన డానికి ఎలాంటి ఆధారాలు లేవని కాంగ్రెస్ నేతలే కొందరు బహిరంగంగా అభిప్రాయపడ్డారు. ఇద్దరు ప్రతిపక్ష నేతలు నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ కూడా ఈ ఆరోపణలతో తమకు సంబంధం లేదని అన్నారు. ఇ.వి.ఎం లలో చాలా కచ్చితంగా, తెలివిగా అవకతవకలకు పాల్పడ్డారని భావించేందుకు వీల్లేదు. ఎందుకంటే, కొన్ని రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించింది, మరికొన్ని రాష్ట్రాల్లో ఓడిపోయింది. కాబట్టి ఇక్కడ ఆ లాజిక్ పని చేయడం లేదు. ఇదంతా కాకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని సాధించలేకపోయింది. పైగా, ఈ ఫలితాలన్నీ మరీ ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు సామాజిక, రాజకీయ సమీకరణలు ఎలా పనిచేసినవో సరిగానే వివరించాయి. మహారాష్ట్రలో ఇవిఎంల ట్యాంపరింగ్‌పై సుప్రియా కూడా విభేదించారు. ఇలా జరిగివుంటే అందరం ఓడిపోయేవారమన్న భావనను వ్యక్త పరిచారు. అంతెందుకు ఇవిఎంల ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి కేంద్రంలో భారీ మెజార్టీతో గెలిచేవారు. రాయబరేలీ, అమేథీ, వయనాడ్‌లలో కూడా బిజెపి గెలిచివుండేది. కాబట్టి ఈ విషయాల జోలికి ఇక పోకపోవడమే మంచిది. ఇవిఎంల గురించి గతంలో ఎన్నికల సంఘం పలుమార్లు వివరణ ఇచ్చింది. కాంగ్రెస్ ఈ విషయంలో అతిగా మాట్లాడడం మానుకోవాలి. ఎందుకంటే ఇవిఎంల ట్యాంపరింగ్ జరిగివుంటే కాంగ్రెస్ ఈ స్థాయికి వచ్చేది కాదు. అలాగే మోడీ కూడా భారీ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే వారు. ఇకపోతే మోడీ కూడా ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకుని ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై దృష్టి పెట్టాలి. క్షుద్ర రాజకీయాలు మాని ప్రజా సంక్షేమంపై దృష్టి సారించకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. కాంగ్రెస్ కూడా ప్రజల సమస్యలు ఎజెండాగా నిర్మాణాత్మక విపక్ష పాత్రను పోషించాలి.

# ఆందోళనకరంగా ఆహార ద్రవ్యోల్బణం



### పెరుగుతున్న ధరలతో సామాన్యలకు కష్టం
### దిగజారుతున్న జీవన ప్రమాణాలపై నిర్లక్ష్యం

న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణాన్ని అదుపులోనే ఉంచామని చెబుతున్న మోడీ ప్రభుత్వం ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదలపై మాత్రం అబద్ధాలు చెబుతోంది. మరో వైపు నిత్యావసరాల ధరల అదుపునకు ఆహార పదార్థాల నిల్వలపై పరిమితులు, ఎగుమతులపై నిషేధం, ఎక్స్‌పోర్టులపై సుంకాల పెంపు వంటి కాయకల్ప చర్యలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తోంది. ఆ చర్యలు ధరల పెరుగుదలను స్వల్పంగా కూడా కట్టడి చేయలేక పోతున్నాయని పూట గడవటం కష్టంగా పరిణమించిన ప్రజల దైనందన జీవనం తెలియజేస్తోంది. ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి మరొక ముఖ్య కారణం వ్యవసాయ సంక్షోభం, వాతావరణ మార్పులు. ప్రభుత్వ విధానాలు వ్యవసాయ రంగాన్ని బలిపీఠం మీదికి ఎక్కించగా, కరువులు, తుపాన్లు, ఇతర విపత్తులు సాగును ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. దేశంలో ఆహార పదార్థాల ధరలు తారెత్తిస్తున్నాయని కేంద్ర గణాంకశాఖ తాజాగా విడుదల చేసిన 'కుటుంబ వినియోగ వ్యయం-2023-24' నివేదిక స్పష్టం చేసింది. కొత్త గృహ వినియోగ సర్వే డేటా అంతకు ముందు సంవత్సరం కంటే ఆహార పదార్థాలపై వ్యయం పెరిగిందని వెల్లడించింది. ఈ సర్వే గతేడాదికి సంబంధించినది. ఈ సంవత్సరం డేటా కనుక వస్తే ధరల వికటాట్టహాసం మరింత ఆవిష్కృతం అవుతుంది. 2023-24లో కుటుంబ నెలవారీ ఖర్చుల్లో గ్రామీణులు ఆహారం కోసం చేసిన ఖర్చు 47.04 శాతం కాగా అంతకు ముందు సంవత్సరం ఆ వ్యయం 46.40 శాతంగా ఉంది. నిరుడు పట్టణ వాసుల్లో ఆహారం కోసం చేసిన ఖర్చు 39.68 శాతం కాగా మునుపటి ఏడాది అది 39.17 శాతం. కుటుంబాల ఆహార ఖర్చు అంతకంతకూ పెరగడమంటే దానర్థం నిత్యావసరాలైన బియ్యం, ఉప్పు, పప్పు, చక్కెర, వంట నూనె, కూరగాయల ధరలు పెరుగుతున్నాయనే. ధరల పెరుగుదల ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదల తీవ్రతను సూచిస్తోంది. పెరుగుతోందన్నది వాస్తవ చిత్రం.పోషకాహార లోపం వలన చిన్నారుల్లో, మహిళల్లో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు రోజూ చర్చించుకుంటున్నవే. ప్రపంచ ఆకలి సూచిలో భారత దేశం స్థానం ఎక్కడో చిట్ట చివరన కునారిల్లుతోంది. కొన్నేళ్లుగా మన స్థానంలో ఎలాంటి మార్పు లేదు. 2030 నాటికి ఆకలి లేని ప్రపంచాన్ని సాధించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశిరచిన లక్ష్యం సమీప భవిష్యత్తులో నెరవేరే జాడ కనిపించట్లేదు. ఈ పరిస్థితుల్లో ఆహార వస్తువుల ధరల పెరుగుదల, ప్రమాదకర స్థాయికి ఆహార ద్రవ్యోల్బణం ప్రజలను ఇంకా ఆహారాన్ని దూరం చేస్తుంది.ఆహారంపై ఖర్చు గడచిన పన్నెండేళ్లల్లో, సంవత్సర సంవత్సరానికీ పెరుగుదల రేటు అంత పెద్దది కానప్పటికీ, మునుపటి సంవత్సరంనాటి ద్రవ్యోల్బణం పెరుగుదల రేటుతో పోల్చితే గృహ వినియోగ అంశాలను ప్రభావితం చేశాయని నివేదిక తెలుపుతోంది. ఏ గణాంకాలను ఏ రకంగా విశ్లేషించినా వాస్తవంలో జనసామాన్యానికి ధరలు మంట పుట్టిస్తున్నాయని, వారు ఆహారం కోసం చేసే ఖర్చు ధిక ఆహార ద్రవ్యోల్బణం అధిక రిటైల్ ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లు తగ్గించకుండా అడ్డుకునేలా చేస్తుంది. వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోరాదన్న డిమాండ్ ప్రముఖంగా ముందుకొస్తోంది. ప్రస్తుతానికి దానిపై ఆర్‌బిఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ భవిష్యత్తులో ఆ దిశగా ఆర్‌బిఐ అడుగులు పడవచ్చన్నది ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. ప్రాతిపదిక సంవత్సరాలను మార్చినా, మరే జిమ్మిక్కు చేసినా ద్రవ్యోల్బణం తగ్గినట్టు చూపించవచ్చునేమో కానీ ఆహార ద్రవ్యోల్బణం సవాల్ అలాగే ఉంటుంది. నయా-ఉదారవాద విధానాలే అందుకు కారణం. ప్రభుత్వ ఖర్చు పెరిగితే ప్రజల ఉపాధి, ఆదాయాలు, సంక్షేమం మెరుగవుతాయి. ఆ ప్రభావం ద్రవ్యోల్బణాన్ని, ఆహార ద్రవ్యోల్బణం తగ్గించవచ్చునేమో కానీ నయా-ఉదారవాద విధానాలను విడనాడటం కాదు, వాటిని మరింత వేగంగా అమలు చేయసిద్ధమైంది కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం. కాబట్టి ప్రజలు ధరల పెరుగుదలను, ఆ విధానాలను వ్యతిరేకించడమే ముఖ్యం.

# విభిన్నంగా హనుమజ్జయంతి

### తమిళనాట వింత సంస్కృతి

చెన్నై : హిందువులు జరుపుకునే పండగలలో హనుమాన్ జయంతి ఒకటి. అయితే ఈ హనుమాన్ జయంతిని ఒకొక్క రాష్ట్రంలో ఒకోక్క సారి జరుపుకుంటారు. తాజాగా తమిళనాడులోని ప్రముఖ నమక్కల్ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఆంజనేయ స్వామి విగ్రహం 18 అడుగుల పొడవుతో దేశంలోనే పొడవైన హనుమాన్ విగ్రహాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. ఈ భారీ హనుమాన్ విగ్రహం ఏక శిలా విగ్రహం. ఇది 5వ శతాబ్దం నాటిదని నమ్మకం. ఈ ఆలయాన్ని ద్రావిడ శైలిలో పాండ్య పాలకులు నిర్మించారు. ఆలయ గర్భాలయానికి పైకప్పు ఉండదు. ఆంజనేయుడు తన నడుములో ఖడ్గాన్ని ధరించి సాలిగ్రామంతో చేసిన మాల చేతపట్టుకుని భక్తులకు దర్శనం ఇస్తాడు. దక్షిణ భారతదేశంలో హనుమంతుడి ఆలయాల్లో వడమాల నైవేద్యం ప్రసిద్ధి చెందింది. అయితే ఇలా వడలను స్వామికి నైవేద్యంగా సమర్పించడం వెనుక పురాణ కథ ఉంది. హనుమంతుడు చిన్నతనంలో.. బాల భానుడి చూసి.. అది తినే వస్తువుగా భావించి ఇష్టపడి.. సూర్యుడిని పట్టుకోవడానికి ఆకాశంలో ఎగురుతూ వెళ్తున్నాడు. అదే సమయంలో రాహు గ్రహం.. గ్రహణం కోసం సూర్యుడిని పట్టుకోవడానికి వస్తున్నాడు. ఇరువు ఒకే సమయంలో సూర్యుడి వైపు పయనించడం మొదలు పెట్టినా.. ఈ రేసులో, హనుమంతుడు, వాయు నందనుడు సులభంగా గెలిచాడు. బాల హనుమంతుని శౌర్యం చూసిన రాహువు హనుమంతుడిని మెచ్చుకున్నాడు. అంతేకాదు హనుమంతుడికి ఒక వరం ఇచ్చాడు. హనుమంతుడిని పూజించే వారు మినప పప్పుతో చేసిన ఆహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తే రాహు దోషం నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నాడు. అయితే అలా సమర్పించే మినప పప్పు ప్రసాదం ఎలా ఉండాలో కూడా వివరించాడు. అందుకనే హనుమాన్ ఆలయాల్లో వడమాలలను భక్తులు సమర్పిస్తారు. అయితే ఈ వడమాలలోని వడల సంఖ్యకు నియమాలు లేవు.వాయుపుత్రుడి జన్మ దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించారు. భారీ వడమాలను స్వామివారికి సమర్పించారు. మిళనాడులోని సేలం సమీపంలోని నమక్కల్ లో ఉన్న హనుమంతుడి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామున ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారికి భారీ వడ మాలను సమర్పిమ్చారు. హనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. స్వామివారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇక్కడ ఉన్న ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను ప్రతి ఏడాది మార్గశిర నెల తొలి నక్షత్రం రోజున నిర్వహిస్తారు. వేకువజామున 18 అడుగుల పొడవున్న స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేయడంతో పాటు 1,00,008 వడల తో తయారు చేసిన మాలను అలంకరించారు. విశేష పూజల అనంతరం కర్పూర హారతినిచ్చారు. మధ్యాహ్నం కొబ్బరి నూనె, పాలు, పెరుగు, చందనం, శనగ పిండి, పంచామృతంతో అభిషేకం చేశారు. సాయంత్రం 4 గంటలకు ఆంజనేయ స్వామికి ముత్తంగి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



# శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనానికి బాబు ఎత్తులు


### నీటిని తరలించుకు పోయే కుట్రలు
### మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ : శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చలాయించి నీళ్లను తరలించుకు పోయేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని చెప్పిన ప్రధాని మోడీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం విడ్డూరమన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఇదే జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టును పూర్తిచేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ సస్యశ్యామలం అవుతుందని, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, ఏపీ ప్రభుత్వంతో చర్చించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యాచరణ ప్రకటిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో 90 శాతం నిర్మించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంపై కాంగ్రెస్ సర్కారు నిర్ల క్ష్యం వహిస్తున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రేవంత్ ఏడాది పాలనలో ప్రతి పక్షాలు, రైతులపై కేసులు పెట్టడం, డైవర్షన్ డ్రామాలు తప్ప సాధించిందేమీ లేదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో పర్యావరణ, అటవీ అనుమతులు సాధించి, అహోరాత్రులు శ్రమించి నిర్మించిన ప్రాజెక్టు ద్వారా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని మీడియాలో దుష్ప్రచారం జరగడం ఆందోళన కలిగిస్తున్నదని వాపోయారు. అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఏపీ సర్కారు ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినా, కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి తీసుకున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు.



# అక్కడున్నది సాక్షాత్తూ ఆయనే!

భగవంతుడంటే మానవజాతి నుంచి వేరుగా, సుదూరంగా ఉండేవాడని కాదు. తన ధామం నుంచి దిగివచ్చి ఈ లోకంలో వివిధ అవతారాలలో మనకు దర్శన మిస్తాడు. తన అవతార ప్రయోజనాన్ని భగవద్గీతలో తానే స్వయంగా వివరించాడు కూడా. శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ కోసం తాను యుగయుగంలోనూ అవతరిస్తానని మరీ ప్రకటించాడు. అంతేగాక, మానవజాతి శాంతియుతంగా, సంతోషంగా, సుసంపన్నంగా ఉండేందుకు తగిన ధర్మ సంస్థాపన కూడా గావిస్తాడు. భగవంతుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. తన సంకల్ప మాత్రంగా ఏ రూపంలోనైనా లోకంలో అవతరించగలడు. నరసింహుడై స్తంభంలో ఉద్భవించగలడు. బ్రహ్మదేవుడి నాసికా రంధ్రం నుంచి వరాహమూర్తిగా జనించగలడు! తనకు నచ్చిన విధంగా తన భక్తులకు దర్శనమిచ్చి తగిన సేవా భాగ్యాన్ని ప్రసాదించగలిగే సర్వస్వతంత్రుడు ఆ దేవాదిదేవుడు. అలాంటి ఒక రూపమే మందిరంలోని భగవంతుడి అర్చావతారం. దేవాలయంలోని మూర్తి రాతితోనో, లోహంతోనో నిర్మితమైన వస్తువు కాదు. అది సాక్షాత్తూ భగవంతుడే. సాకారుడా..? నిరాకారుడా? పరబ్రహ్మ స్వరూపుడైన దేవదేవుడు మూడు విధాలుగా వ్యక్తమవుతాడని శాస్త్రాలు నిశ్చయంగా నిరూపిస్తున్నాయి. అవి.. 1. నిరాకార, వైవిధ్య రహితమైన బ్రహ్మజ్యోతిగా పిలిచే సర్వ వ్యాపకత్వం. 2. ప్రతి జీవి హృదయాంతరంలో కొలువై ఉన్న పరమాత్మ తత్వం. 3. షడైశ్వర్య సంపూర్ణుడై మూర్తీభవించిన భగవత్ తత్త్వం. సకల ఇతర భగవత్ తత్త్వాలకు ఇదే మూలం. బ్రహ్మజ్యోతికి తానే ఆధారమని భగవద్గీతలో శ్రీకృష్ణుడు వివరించాడు. సకల చరాచర జీవుల హృదయాలలో పరమాత్మగా ఉన్నది తానేనని అందులో చెప్పాడు. భగవద్గీత 12వ అధ్యాయంలో తాను కేవలం సగుణాత్మక ఆరాధన ద్వారా మాత్రమే ప్రసన్నుడనవుతానని శ్రీకృష్ణుడు తెలియజేశాడు.



ఆధ్యాత్మికం

# కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించింది

- 5 ఎళ్ల మా పాలనలో రామగుండానికి మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఎర్పాటు చేయుంచా
- తొలి సిఎం కేసీఆర్‌ని నిందించడం తప్ప కాంగ్రెస్ చేసింది ఏమి లేదు
- తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచి మార్చేందుకు తొలి సిఎం కేసీఆర్ శ్రమించారు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించింది. 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామిలను నెర్చవెర్చకుండా సంవత్సర కాలంగా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మ్హొసం చేస్తుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలైనా మహిళలకు 2500, వృద్దులకు 4 వేల ఫించన్ రైతు భరోసా రైతు బంధు విద్యార్థులు స్కూటీలు తదితర హామిలు 2025వ సంవత్సరంలోనైనా నేరవెర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే బి.ఆర్.ఎస్ పార్టీ పక్షానా పోరాడుతామని హెచ్చరించారు.

రామగుండం ప్రజలందరి ఆశీర్వాదం తో 2018లో ఎమ్మెల్యే గెలిచిన తర్వాత 2 సంవత్సరాల పాటు కారోనా మహమ్మరి ప్రజల జీవితాలను అతలకుతలం చేసిందని గుర్తుచేశారు. సందర్భంలో ప్రజలందరికీ అండగా నిలిచామన్నారు. అనాడు పెదప్రజలు ఆసుపత్రికి వెల్లామన్నా సౌకర్యాలు లేవు. కాలుష్యానికి నిలయంగా ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి కార్పోరేట్ స్థాయి వైద్యం అందాలన్నా సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ని మెప్పించి ఓప్పించి ఈ ప్రాంతానికి సింగరేణి సంస్థ ద్వారా 510 కోట్లతో సింగరేణి ఇన్నిట్యూట్ ఆఫ్ మెడికల్ వైద్యకళాశాలను, నర్సింగ్ కళాశాలను తన 5 ఎళ్ల కాలంలో విజయవంతంగా ఎర్పాటు చేయుంచామని చెప్పారు. మెడికల్ కళాశాల నర్సింగ్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచి చేయాలని కేసీఆర్ గారు 10 ఎళ్ల శ్రమించారన్నారు. దేశంలో ఎక్కువ లేని రైతు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసింది బి.ఆర్.ఎస్ పార్టీ తొలి సిఎం కేసీఆర్ అన్నారు.

అభివృద్ధి సంక్షేమ చెస్తాం మార్పు తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా ఇచ్చిన హామిలను నెరవెర్చాకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఎళ్ల పాటు అభివృద్ధి సంక్షేమంలో ముందుకు తీసుకువేల్లినా తొలి సిఎం కేసీఆర్ ని కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం వారిపై నిలపినిందాలు వేస్తు మాటాలు మాట్లాడుతూ కాలం గడిపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేఖరుల సమావేశం లో కార్పోరేటర్లు బాదె అంజలి కల్వచర్ల కృష్ణ వేణీ జనగామ కవిత సరోజినీ కుమ్మరి శ్రీనివాస్ గాధం విజయ నాయకులు అచ్చే వేణు చెలకలపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి సట్టు శ్రీనివాస్ పిల్లి రమెష్ మెతుకు దేవరాజ్ ఇరుగురాళ్ల శ్రావన్ నిట్టూరి రాజు ముద్దసాని సంధ్యా రెడ్డి ఆవునూరి వెంకటేష్ బొబ్బిలి సతీశ్ వెంకన్న కొడి రామకృష్ణ అల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పాత్ర కీలకమైనది

## పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్ టౌన్, డిసెంబర్31(ది క్రైమ్ న్యూస్):** విద్యావ్యవస్థలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పాత్ర కీలకమైనది విద్యా వ్యవస్థలో వీరిని విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని రకాల వసతులు కల్పించాలి.సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగికి వర్తించే అన్ని వసతులు కల్పించాలి. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులరైజేషన్ చేయాలని 22 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించిన ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు. సంరక్షణ చట్టం కొరకు 2018 లోనే కేంద్రంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సంరక్షణ చట్టానికి ప్రయివేట్ బిల్ పెట్టించమని ఈ బిల్లుకు సపోర్ట్ చేసేవారు లేక అడుగున పడి పోయింది అని, కేంద్ర ప్రభుత్వం విద్యా సుంకం పేరుతో లక్షల కోట్లు కూడా పెట్టి విద్య వ్యవస్థకు ఖర్చు పెట్టకుండా దానిని వేరే పద్దు కు మారుస్తున్నారని, పట్టభద్రుల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా కళాశాలలు మూతపడ్డాయని ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు కృషి చేస్తానని అన్నారు. 22 సంవత్సరాలుగా ప్రజాసేవ ప్రజా సమస్యల కొరకు పనిచేస్తున్నానని అన్నారు. పట్టభద్రుల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతానని ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఎంతోమంది ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న వారికి సంరక్షణ చట్టం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ 272 మండలాలను తిరిగి అక్కడి సమస్యలను తెలుసుకున్నానని అన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ మరి హెల్త్ కార్డులాకై కృషి చేస్తానని, పట్టభద్రుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధి ధ్యేయంగా మీ ముందుకు వస్తున్నానని ఎమ్మెల్సీగా కాదు మీకు సేవ చేసే సేవకుడిగా వస్తున్నాను ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తాను పాలకుడిగా కాదు సేవకుడిగా మీ ముందుకు వస్తున్న అని అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షులు లింగ గౌడ్, వెంకటేశం ట్రస్మా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ట్రస్మా బాధ్యులు సెయింట్ అంతోని,ప్రమోద్, సతీష్ ,ప్రశాంత్, కిషన్, ఎం నాగిరెడ్డి,మచ్చేందర్, బాబు ,రవి పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించిన బండి రమేష్



**కూకట్ పల్లి డిసెంబర్ 31 (ది క్రైమ్ న్యూస్):**నూతన సంవత్సరం పురస్కరించుకొని, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ చేతుల మీదుగా యువజన కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం అధ్యక్షుడు ఎం.డి సలీం ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర (2025) క్యాలెండర్ ను ఆవిష్కరించారు. నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, యూత్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## ముత్తారం మండలంలోని నర్సరీని పరిశీలించిన డిఆర్డిఓ.



**ముత్తారం.డిసెంబర్.31.(ది క్రైమ్ న్యూస్):**ముత్తారం మండలంలో మంగళవారం డిఆర్డిఓ కళందిని పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని పారుపల్లి గ్రామ నర్సరీని పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ నర్సరీలోని ప్రతి మొక్కని కాపాడుకోవాలని వాటికి ఎల్లప్పుడు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలని,బ్లీచింగ్ చేయించాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన జాగ్రతలు తీసుకోవాలని వాటర్ ట్యాంక్ లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని తెలిపారు.అనంతరం ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్,ఎంపీవో గోవర్ధన్,కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక సమావేశం



**ధర్మపురి డిసెంబర్ 31, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయం నందు మున్సిపల్ సాధారణ సమావేశం చైర్పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో 11 అంశాలు తీర్మానించబడినవని కమిషనర్ కె. శ్రీనివాస్ తెలిపారు. పారిశుద్ధ విభాగంలో పారిశుద్ధ్య వాహనాలు రిపైర్స్ మరియు గోదావరి నదివద్ద చెత్తకుండీల పై ప్లెక్సీలు ఏర్పాటు మరియు ఇంజనీరింగ్ విభాగంలో గేటు వాల్స్ రిపేర్, పైప్ లైన్ రిపేర్లు, ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్స్, బ్లీచింగ్ పౌడర్ బత్తాలు కొనుగోలు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కాలపరిమితి పెంపు, నూతన అంగన్వాడి సెంటర్ నిర్మాణం తదితర అంశాలు తీర్మానించబడినవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కే శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మున్సిపల్ స్టాఫ్ మేనేజర్ గంగాధర్, సానిటరి ఇన్స్పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్లు అయ్యేరీ వేణుగోపాల్, సంతోషి, కిరణ్ మై, కార్తీక్, సుధాకర్, నాగలక్ష్మి, ఉమా లక్ష్మి, పద్మ, జక్కు పద్మ, అరుణ, అశోక్, యునస్, విజయలక్ష్మి, కో ఆప్షన్ నెంబర్స్ పద్మ , అలీమ్, టీఎంసీ జలెందర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మహేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



**తిమ్మాపూర్ (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ మాజీ వార్డు సభ్యురాలు,కాంగ్రెస్ యువ నాయకులు రాగుల నర్మద -పర్శరాములు గౌడ్ తమ కూతురు రేణురుగ్వేద పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని పారిశుద్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేసి అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనాదాశ్రమ వృద్ధులు రేణురుగ్వేదకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, మనసారా దీవించారు. పర్శరాములు దంపతులు మాట్లాడుతూ..తమ కూతురు పుట్టిన రోజున అనాధలకు అన్నం పెట్టడం మిక్కిలి ఆనందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో కర్ణబత్తుల మనోహర్, బనుక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రమేలా సత్పతి



**శంకరపట్నం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, ల్యాబ్ , ఫార్మసీలను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరాతీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేందుకు వసతులు కల్పిస్తుందని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు.కార్యక్రమంలో డిఎంహెచ్ఓ వెంకటరమణ, మండల వైద్యాధికారి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి కి ప్రభుత్వ విప్‌కు ప్రత్యేక ఆహ్వానం అందించిన ఆలయ అధికారులు



**ధర్మపురి డిసెంబర్ 31, (ది క్రైమ్ న్యూస్):** ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఆలయ అధికారులు ప్రత్యేక ఆహ్వానం అందించారు. మంగళవారం ఉదయం ధర్మపురి లోని క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి దేవస్థానము ఈఓ సంకటాల శ్రీనివాస్ వేదపండితులు అర్చకులతో కలిసి ఈ నెల 10వ తేదీన నిర్వహించ తలపెట్టిన ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి ఆహ్వానం తో పాటు స్వామి వారి శేష వస్త్ర ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల చేయాలి: కలెక్టర్ పమేలా సత్పతి

**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి లోని లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీటిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం విడుదల చేశారు.జలాశయంలో పూలు చల్లి రెగ్యులేటర్ గేట్ వద్ద పూజలు నిర్వహించాచిన అనంతరం స్విచ్ ఆన్ చేసి కెనాల్ కు నీటి విడుదల చేశారు. ఆయకట్టు విస్తీర్ణం, జలాశయం సామర్థ్యం, విడుదల చేస్తున్న నీటి సామర్థ్యం గురించి నీటిపారుదల శాఖ ఎస్.ఈ పెద్ది రమేష్ ను అడుగగా యాసంగి సీజన్ కు మొత్తం 44.480 టి.ఎం.సిల నీటి విడుదలకు ప్రణాళిక సిద్ధం చేసి మొత్తం 6 లక్షలా 97 వేలా 708 ఎకరాలకు వచ్చే మార్చి 31 వరకు నీటి విడుదల కొనసాగిస్తామని,జోన్ 1, జోన్ 2 పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ 11 టీఎంసీలు మధ్య మానేరు ద్వారా, ఐదు టీఎంసీలు ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నీటిని సేకరించి విడుదల చేస్తామని ప్రస్తుతం లోయర్ మానేరు జలాశయంలో 22.870 టిఎంసిల నీటి నిలువ ఉందని ఎస్.ఈ పెద్ది రమేష్ తెలుపడంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల కొనసాగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఏఈఈ నాగభూషన్ రావు, డి.ఈ శ్రీనివాస్, ఏఏఈలు వంశీధర్, దీపిక, సంజన, కిరణ్ పాల్గొన్నారు.



## ఘనంగా రామారావు జన్మదిన వేడుకలు..



**ఇల్లందకుంట డిసెంబర్ 31 (ది క్రైమ్ న్యూస్)**
హైదరాబాద్ లో ప్రణవ్ బాబు నివాసం లో పార్టీ ఇల్లందకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు పుట్టినరోజు సందర్భంగా ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు ని%శీ%డు మనుసు తో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌడిషాల పరమేశ్వర్, గోలి కిరణ్,ఎడ్ల కిషన్ రెడ్డి మూడేత్తుల మలేష్,ఎండీ లాల్ ,ఎండీ సలీం హుజురాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న అడిషనల్ మెజిస్ట్రేట్...



**ఇల్లందకుంట డిసెంబర్ 31 (ది క్రైమ్ న్యూస్) :** కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అపర అయోధ్యపురి అపర భద్రాద్రిగా విలసిల్లుతున్న ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ధనుర్మాసం సందర్భంగా హుజురాబాద్ కోర్టు అడిషనల్ మెజిస్ట్రేట్, పద్మ సాయి శ్రీ వారి కుటుంబ సమేతంగా శ్రీ స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి మెమెంటోను బహుకరించి శాలువాతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనం చేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యానిర్వహణాధికారి, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి క్రీడలకు..

- తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల శిక్షణతో రాణిస్తున్న యువతి
- స్పాన్సర్స్ ముందుకు వస్తే మరిన్ని పథకాలు



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ కుటుంబానికి చెందిన మౌటమ్ శ్రీనివాస రామ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె సంగీత ప్రస్తుతం స్థానిక మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. చిన్నతనం నుండే ఆటపాటల్లో రాణిస్తున్న సంగీత గత కొద్ది సంవత్సరాలుగా అథ్లెటిక్స్ హామర్, డిస్కతో, జావలింత్రో లో రాణిస్తూ ఎన్నో పథకాలు మెడల్స్ సాధించింది. గతంలో జాతీయస్థాయిలోనూ రాణించిన ఈ క్రీడాకారిని ప్రస్తుతం జరుగుతున్న %ంస్త్రట% పోటీల్లో జిల్లాస్థాయి నుండి, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించింది. రాష్ట్రస్థాయిలో హామర్ విభాగంలో సెకండ్ ప్లేస్ లో, డిస్కస్ త్రో, జావలింగ్ త్రోలో మూడో ప్లేస్ లో నిలిచి పథకాలు రాణించగా, జార?ండ్లో జనవరి మొదటి వారంలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటనుంది. రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న యువతిని స్థానికులు అభినందిస్తుండగా, తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు. స్పాన్సర్స్ ముందుకు వస్తే మరిన్ని పథకాలతో పాటు అథ్లెటిక్స్లో మంచి పేరు సంపాదిస్తుందని, స్పాన్సర్స్ ముందుకు రావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. యువ క్రీడాకారిని ని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత,మాజీ ఉపసర్పంచ్ రమేష్, ముదిరాజ్ కులస్తులు శ్రీనివాస్ లు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ ఎంపీపీని కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, వ్యాపారస్తులు కోలేటి అంజన్న,కోలేటి వేణు తల్లి కోలేటి సుశీల ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుశీలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కోలేటి రమేష్ సీనియర్ పాత్రికేయులు జబ్బర్ ఖాన్,పీవీరావు, నాయకులు సందేవేన కుమార్,తన్నీరు ప్రదీప్, కోలేటి సురేష్, విద్యుత్తు లైన్ మెన్ కలవేన సదానందం పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ కు స్థల సేకరణ



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో అంగన్వాడి సెంటర్-1 కు మంగళవారం స్థల సేకరణకు సర్వే నిర్వహించారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలతో తహసిల్దార్ బొర్కారి రామచంద్రరావు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ నాగండ్ల రాధిక గ్రామపంచాయతీ ఆవరణలో స్థలమును కొలతలు తీసుకోవడం జరిగింది. మంథని ఐసీడీఎస్ సీడీపీఓ పుష్పలత ప్రతిపాదనలతో ఈ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పల్లె అనిత, గ్రామ స్పెషల్ ఆఫీసర్ మబ్బు. వాసవి,పంచాయతీ సెక్రటరీ భూసారం రమేష్, అంగన్వాడీ టీచర్ జి.పద్మ పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి

### జిల్లా వ్యవసాధికారి దోమ ఆదిరెడ్డి



రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:- రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి అని పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కమాన్ పూర్ మండలంలోని డీసీఎంఎస్ జూలపల్లి శ్రీరామ కమాన్ పూర్ బాలకృష్ణ, గుండారం ఆకుల సదయ్యకు చెందిన అర్చన ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూల దుకాణాలలో నాసిరక మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైతులు తమ పంటలకు ఇష్టానుసారంగా మందులు వేయకుండా వ్యవసాయ అధికారులు సూచించిన ఎరువులు మాత్రమే వాడాలని ఆయన అన్నారు. ఫెర్టిలైజర్ వారు నాణ్యతలేని ఎరువుల అమ్మితే వారి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ ఉన్నారు.

## జేఎన్టీయూహెచ్ క్లీన్ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న జె.ఎన్.టి.యు జెఏసి నాయకులు





**కూకట్ పల్లి డిసెంబర్ 31 (ది క్రైమ్ న్యూస్):** తాము చదువుకుంటున్న చోటును పరిశుభ్రతతో పాటు, ఆహ్లాదకరంగా ఉంచాలనే భావనతో తమ వంతు బాధ్యతగా హైదరాబాద్ కూకట్ పల్లి లోని జేఎన్టీయూ లో మంగళవారం చేపట్టిన క్లీన్ క్యాంపస్ డ్రైవ్ లో పాల్గొన్న జె.ఎన్.టి.యు జేఏసీ నాయకులు. ఈ కార్యక్రమాన్ని యునివర్సిటీ ఇంచార్జి వి.సి ప్రో.బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ జేఎన్టీయూహెచ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శోభారాణి తో కలిసి క్యాంపస్ లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చీపుర్లను చేతబట్టి క్యాంపస్ లోనీ రోడ్లను శుభ్రం చేశారు. విరిగిపడిన చెట్ల కొమ్మల తొ పాటు క్యాంపస్ లో పేరుకుపోయిన చెత్తాచెదారని తొలగించి, పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో జేఎన్టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర నాయకులు అంబటి తేజ, దాస్యం విక్రాంత్, బల్గర్ సందీప్, తిరుపతి, తేజ, దిలిప్, శివాజీ, రాము, యూనివర్సిటీ నాయకులు సాయ్ తేజ, వేణు, సైదా, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ పరిశ్రమల శాఖ మంత్రికి ముదిరాజ్ కులస్తులు వినతి పత్రం



**ముత్తారం.డిసెంబర్.31.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం గ్రామ ముదిరాజ్ కులస్తులకు సంబంధించిన ఇంటి స్థలాలను పట్టాలు చేయాలని హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మంగళవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ముదిరాజ్ కులస్తులు వినతి పత్రం అందజేశారు.దీనిపై వెంటనే స్పందించిన మంత్రి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి వారందరికీ పట్టాలు మంజూరు చేయవలసిందిగా ఆదేశాలు జారీచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి నాగినేని జగన్మోహన్ రావ్,మాజీ సర్పంచ్ తాటిపాముల వకులరాణి-శంకర్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బొల్నేని బుచ్చంరావు,ముదిరాజ్ సోసైటీ సెక్రటరీ కుక్కల చందు,ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం...

### పలు అంశాలపై చర్చించి, ఆమోదం



**జమ్మికుంట డిసెంబర్ 31 (ది క్రైమ్ న్యూస్) :** మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కమిషనర్ మొహమ్మద్ అయాజ్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశము జరిగినది. ఈ సమావేశము ప్రారంభించే ముందు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సమావేశమునకు 30వార్డుల కౌన్సిలర్లు హాజరై 19 అంశాలపై చర్చించి ఆమోదము తెలిపినారు. పురపాలక సంఘం కార్యాలయానికి గేటు నిర్మాణానికి, డిఆర్సిసి సెంటర్ లైట్లు, సిసి కెమెరా, బోర్వెల్ మోటార్, పబ్లిక్ టాయిలెట్స్ మరమ్మత్తులు, పార్కులు, ఆబాది జమ్మికుంట బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్, పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదము తెలిపినారు.



# నేత్ర అవయవ శరీర దానం

## మానవ మనుగడకు మహోపకారం : సదాశయ ఫౌండేషన్ పిలుపు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** తిమ్మాపూర్ లోని స్టేట్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రేయినింగ్ ఇనిస్టిట్యూట్ లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్పూర్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీడియో, ఫోటోగ్రఫీ కోర్స్ విద్యార్థులకు నేత్ర అవయవ శరీర దానాలపై కమాన్పూర్ లైన్స్ క్లబ్ సభ్యులు జాతీయ ప్రధాన కార్యదర్శి లయన్ చోడవరపు లింగమూర్తి అవగాహన కల్పించారు . కోట్ల రూపాయలు పెట్టినా దొరకని మానవ సంజీవినిలు అయినా నేత్రాలు, అవయవాలు ,దేహాలను మట్టిలో కలపకూడదని కాల్చి బూడిద చేయకూడదని అవగాహన కల్పించగా ట్రైనింగ్ చేస్తున్న 35 మందితో పాటు ఐదుగురు కళాశాల అధ్యాపకులు ముందుకు రావడం జరిగింది ముందుకు వచ్చిన వారందరికీ డోనర్ కార్డ్స్ అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంపత్ మరియు సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ బాధ్యులు రాజ కనకయ్య ,నరసింహ చారి పాల్గొన్నారు నేత్ర అవయవ శరీర దానాలకు ముందుకు వచ్చిన వారిని తాడూరు కరుణాకర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ. సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రవణ్ కుమార్, గౌరవాధ్యక్షులు కమాన్పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సాన రామకృష్ణారెడ్డి , నల్లవెల్లి శంకర్, సలహాదారులు నూకా రమేష్, కార్యదర్శి, ప్రచార కార్యదర్శి వాసు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరహరి అభినందించారు.

# డిజేఎఫ్ 5వ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లో జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి,జాతీయ కార్యదర్శి సబ్బితం లక్ష్మణ్,రాష్ట్ర అధ్యక్షుడు మోటపలుకుల.వెంకట్,రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కోల శ్రీనివాస్ పిలుపుమేరకు,మంగళవారం పెద్దపల్లి జిల్లా డిజేఎఫ్ ఉపాధ్యక్షులు కన్నూరి రాజు,జిల్లా కోశాధికారి పెయ్యల రమేష్,ఆధ్వర్యంలో రామగిరి మండలం లో మండల ఎమ్మార్వో,రామగిరి ఎస్ఐ చంద్రకుమార్, ఉమెన్ఎస్ఐ పి.దివ్య ఇరువురి చేతుల మీదుగా,డీజేఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.జాతీయ కమిటీగా ఏర్పాటు అయినా డీజేఎఫ్ డెమొక్రటి జర్నలిస్టు ఫెడరేషన్ విలేకరుల హక్కుల కోసం విలేకరులకు ప్రభుత్వం నుండి రావలసిన ఉచిత విద్య,వైద్యం అనే నినాదంతో జనవరి 10వ తేదీ నాడు ఉద్యమాల పోరుగడ్డ మన కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డిజేఎఫ్ సమావేశానికి జాతీయ,రాష్ట్ర వివిధ జిల్లాల విలేకరులు అధిక సంఖ్యలో సభ కు రావాలని,విలేకరుల హక్కుల కోసమే ప్రతి నిమిషం పోరాటం చేస్తున్నటువంటి డిజేఎఫ్ మహాసభ నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశానికి వందలాదిగా...వేలాదిగా డిజేఎఫ్ విలేఖరులు హక్కుల కోసం ప్రజా శ్రేయస్సు కోసం పోరాడే విలేకరులకు ఎంతైనా తమ హక్కుల కోసం పోరాడే సమయం ఆసన్నమైందన్నారు.ఈ కార్యక్రమంలో డిజేఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు కనుక్కుట్ల రమేష్,రామగుండం మండల అధ్యక్షులు మామిడిస్వామి, ప్రధానకార్యదర్శి కన్నూరి జెస్ కుమార్,బడికేల కృష్ణ పాల్గొని పిలుపునిచ్చారు.

## అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు భరోసా

### -2 లక్షల 50 వేల ఎల్ ఓ సి మంజూరు.



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** పేద ప్రజలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారు. అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు అధిక మొత్తంలో ఎల్ఓసిలు మంజూరు చేపిస్తూ భరోసా కల్పిస్తూన్నారు. మంథని నియోజకవర్గం కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన పోలు దాసరి సాకేత్ వర్మ గుండె వైద్య చికిత్సకు సంబంధించిన నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతు సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను సంప్రదించగా వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్త%శీ% వీరికి రెండు లక్షల యాభై వేల ఎల్ఓసి మంజూరు చేయించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు మంగళవారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను అందజేశారు. రెండు లక్షల యాభై వేల రూపాయలు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు సాకేత్ వర్మ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామీణ ఉపాది హామి పథకం అదనపు కార్యక్రమ అధికారులు సమావేశమై నూతన కమిటీ ఎన్నిక



కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ) హనుమకొండ జిల్లా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామి పథకం అదనపు కార్యక్రమ అధికారులు. డి ఆర్ డి ఏ కార్యాలయంలో సమావేశమై గత కమిటి సభ్యులు వ్యక్తిగత కారణాల వలన రాజనామా చేసినందున మరియు గత కమిటీ ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తి అయినందున మెజార్టీ సభ్యుల అంగీకారంతో మరియు ఏకగ్రీవ ఆమోదుతో నూతన కమిటి ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలోఅధ్యక్షులుగా పెరుమాండ్ల కుమారస్వామి ఏపీవో భీమదేవరపల్లి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపీవో నక్క కుమారస్వామి ఐయినవోలు, ఉపాధ్యక్షులుగా కీర్తి అనిత ఏపీవో శాయంపేట, ప్రధాన కార్యవర్శి నలుమాటల రమేష్ ఏపీవో కమలాపూర్, సహాయ కార్యదర్శి :కలకోట్ల విజయలక్ష్మిలు ఏపీవో హసన్ పర్తి, సహాయ కార్యదర్శి హంసపం మార్త ఇందిర ఏపీవో పరకాల, కే విజయ ఏపీఓ వేలేరు,పై వారందర్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..

## మన వైకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తదానం




**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండిలో ఎస్బిఐ గ్రామీణ స్వయం ఉపాధి వారి సహకారంతో ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మన వైకే ఫౌండేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పాలకుర్తి శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ సంపత్, కోఆర్డినేటర్ స్వప్న, సదాశివ ఫౌండేషన్ వారు ఆపదలో ఉన్నవారికి రక్తదానం, అవయవదానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేస్తూ దాతలను ప్రోత్సాహించారు. కార్యక్రమంలో 21 మంది విద్యార్థులు ఉత్సాహంగా రక్తదానం చేయగా కార్యక్రమానికి సహకరించిన మైత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి,మన వైకే ఫౌండేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బుర్ర బాబు గౌడ్ కి, ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ స్టాఫ్ కు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందెం సురేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గెలుపోటములు సహజం

### - మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైనాల రాజు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్) డిసెంబర్ 31:** ఆటల్లో గెలుపు ఓటములు సహజమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని ఆదర్శనగర్ గ్రౌండ్లో అబెంగుల శివాజీ, ముత్యాల అంజి ఆధ్వర్యంలో డిసెంబర్ 31 పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించగా కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఫైనల్ లో జూలపల్లి కమాన్ పూర్ జట్లు పోటీ పడగా కమాన్ పూర్ జట్టు విజేతగా నిలిచింది. కమాన్ పూర్ జట్టు మొదటగా బ్యాటింగ్ చేసి 105 పరుగులకు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జూలపల్లి జట్టు 100 పరుగులకు ఆల్ అవుట్ అయింది. దీంతో కమాన్పూర్ జట్టు విజేతగా నిలిచింది. కమాన్పూర్ జట్టుకు 4000 రూపాయలను కమాన్ పూర్ మండల శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు చేతుల మీదుగా అందజేశారు. రన్నర్ ఆఫ్ జట్టుకు 2000 రూపాయలను నగదును అందజేయడం జరిగింది. ఈ క్రీడల్లో ఇరుగు రాళ్ల కుమార్, అనవేన కొండయ్య, క్రీడాకారులు జంగిలి రమేష్, మట్ట రమేష్, శివాజీ, రఘు, రాకేష్, శ్రీకాంత్, సాయి, రాకేష్, రఘు, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాట తప్పని కాంగ్రెస్ ప్రభుత్వం మాది

### పంగిడిపల్లిలో సీఎం చిత్రపటానికి రైతులు పాలాభిషేకం





హనుమకొండ జిల్లా కమలాపూర్ కమలాపూర్ మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ,మాట తప్పని మడమ తిప్పని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని,ఏడాది కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వం మాది అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ 80% రైతులకు లబ్ధి చేకూరిందని, రెండు రోజుల క్రితం కొంతమంది రైతులు ఒంటి కాలుపై నిరసన చేసిన కార్యక్రమం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉందని అన్నారు. వారు చేసిన ఆరోపణలో ఏ వాస్తవం లేదని వారు అన్నారు. 2 లక్షలకు పైన ఉన్న రైతులకు రుణమాఫీ ఇంకా కాలేదని అందులో ఉన్న వారు రెండు రోజుల క్రితం నిరసన చేసిన వాళ్లేనని చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాటలు వేస్తూ ప్రజల్లో ఎల్లవేళలా ఉంటున్నాడని, ప్రతి పథకం ప్రజలకు అందేలా చూస్తామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఇతర పార్టీల మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి, రైతులు పాలాభిషేకం నిర్వహించారు. కాగా మీడియా సమావేశం కు వచ్చిన ఓ రైతు మన పంగిడిపల్లి గ్రామంలో ఎక్కడ 80% రైతు రుణమాఫీ అయిందో చూపాలని, చూపిస్తే ముక్కు నేలకు రాస్తామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు తిప్పారపు యుగేందర్, ఓబిసి రాష్ట్ర కార్యదర్శి బాలపురి కనకరత్నం, సాంబయ్య, రాజు, చిన్న బాబు, శ్రీను, ఆదిరెడ్డి, నరసయ్య, లింగారావ్, లింగమూర్తి, పార్టీ నాయకులు,రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన అధికారికి ఆత్మీయ సన్మానం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 31:** -రామగుండం-త్రీ ఏరియా లో మంగళవారం జి.ఎం. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన సివిల్ విభాగం డివైఎస్ఇ ఎన్.రామకృష్ణ ను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, తోపాటు అధికారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్.రామకృష్ణ సింగరేణి సంస్థలో సుమారు 41 సంవత్సరాల పాటు వివిధ హెూదాలలో, విధేయతతో, అంకిత భావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్వొటుజియం జి.రఘుపతి, ఫైనాన్స్ఎజిఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, అధికారులు కె.చంద్ర శేఖర్, రాజారెడ్డి, జనార్దన రెడ్డి, బి.సుదర్శనం, కె.ఐలయ్య, ఇ.నాగేశ్వరరావు, ఉదయ్ భాస్కర్, ఉదయ్ హరిజన్, ఆర్.రాజేశ్వరి తోపాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


## కస్తూర్బా గాంధీ సంక్షేమ పాఠశాల కళాశాలను ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ సంక్షేమ పాఠశాల కళాశాలను ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కస్తూరిబా పాఠశాలను 400 పైచిలుకు పాఠశాలలు ఉన్నాయి దీనిలో సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు వీరికి పాటలు చెబుతున్నారు మీరు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నారు మరి విద్యార్థులు పరీక్షల సమయం వస్తున్న వారికి ఇంకా పూర్తిగా సిలబస్ పూర్తవక విద్యార్థులు చదువు నష్టపోతున్నారు దాదాపు 22 రోజుల నుంచి ఈ సమ్మె ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేకి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కనీసం విద్యార్థుల పక్షాన మాట్లాడకుండా సినిమా హీరోల గురించి మాట్లాడుతున్నారు విద్యార్థుల పక్షాన లేకుండా సిగ్గుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక పోకడలతో పోతుంది దాదాపు లక్ష పైచిలుకు అమ్మాయిలు చదువుతున్న కస్తూరిబా సాంఘిక సంక్షేమ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతున్న పట్టించుకోకుండా జలసాల చేసుకుంటున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏబీవీపీ హెచ్చరిస్తుంది పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు ఉండి వారికి చదువును అందించకుండా ఉపాధ్యాయుల సమ్మె చేస్తుంటే మా బాధలు ఎవరు చెప్పుకోమంటూ విద్యార్థులు చెప్పుకున్నారని ఇకనైన సిగ్గు తెచ్చుకుని ఈ గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే కస్తూరిబా గాంధీ సంక్షేమ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు న్యాయం చేయాలని తెలియజేశారు మరియు 10వ తరగతి విద్యార్థులు మరియు ఇంటర్ చదివే విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన ఈ సమయాన్ని వృధా చేస్తున్నా ఈ ముఖ్యమంత్రి మరియు వీళ్లు అమ్మాయిలే కదా అని కస్తూరిబా పాఠశాల విద్యార్థుల మీద ఎందుకు ఈ చిన్న చూపు అని అని తెలియజేయడం జరిగింది వెంటనే ఈ సమస్యను పరిష్కరించుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యులు ఆరెపల్లి సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానోత్ శ్రవణ్ కుమార్, కమలాపూర్ నగర కార్యదర్శి శివ , ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ రోహిత్ , వెంగళ సాయికృష్ణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# థైరాయిడ్ పేషెంట్స్ కచ్చితంగా తినాల్సిన..

# అయోడిన్ రిచ్ ఫుడ్స్..!



ప్రస్తుతం థైరాయిడ్ సమస్యతో బాధపడేవారి సంఖ్య ఎక్కువవుతోంది. థైరాయిడ్ పేషెంట్స్ అయోడిన్ రిచ్ ఫుడ్స్ తీసుకుంటే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్య.. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ గ్రంథి సాధారణ పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. థైరాయిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. గుండె, మెదడు, లివర్, కిడ్నీ, చర్మంతో సహా వివిధ అవయవాలపై హానికర ప్రభావం పడే ప్రమాదం ఉంది. థైరాయిడ్ గ్రంథి నుంచి విడుదలైన హార్మోన్లు రక్తప్రవాహంలో కలిసి చాలా కీలకమైన జీవక్రియలను నిర్వహిస్తుంటాయి. శ్వాసవ్యవస్థ, సంతానోత్పత్తి వ్యవస్థ, గుండె, నాడీ, జీర్ణవ్యవస్థ... ఇలా చాలా వాటిపై థైరాయిడ్ హార్మోన్ ప్రభావం ఉంటుంది. హార్మోన్ ఉత్పత్తిలో అసమతుల్యత థైరాయిడ్ రుగ్మతల లక్షణాలకు దారి తీస్తుంది. థైరాయిడ్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి.. ఆహారంపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యం.?

### థైరాయిడ్ ఉంటే.. ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..?



**సీవీడ్..** కెల్ప్, నోరి, కొంబు వంటి సీవీడ్స్‌లో అయోడిన్ పుష్కలంగా లభిస్తుంది. కెల్ప్‌లో పాంతోతేనిక్ యాసిడ్, రిబోఫ్లావిన్ ఉంటాయి. ఇవి థైరాయిడ్ అసమతుల్యతతో సంబంధం ఉన్న ఆందోళన, డిప్రెషన్‌ను నిర్వహించడానికి తోడ్పడతాయి.

**చీజ్..**చీజ్ శరీరానికి..కాల్షియం, ఆరోగ్యకరమైన కొవ్వులను అందించడమే కాకుండా వీటిలో అయోడిన్ మెండుగా ఉంటుంది. చెడ్డార్, మోజారెల్లా చీజ్ బెస్ట్ ఆప్షన్స్. పాలలోనూ అయోడిన్ సమృద్ధిగా దొరుకుతుంది. ప్రతి 250 పాలలో దాదాపు 150 మైక్రోగ్రాముల అయోడిన్ ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**ట్యూనా..** ప్రతి 6-ఔన్సుల ట్యూనా 34 మైక్రోగ్రాముల అయోడిన్‌ను అందిస్తుంది. మీ డైట్‌లో ట్యూనా చేర్చుకుంటే.. థైరాయిడ్ పనితీరు మెరుగుపడుతుంది. ట్యూనా మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్‌ను శరీరానికి అందిస్తుంది. రొయ్యలలోనూ అయోడిన్ సమృద్ధిగా లభిస్తుంది.

**గుడ్లు..** గుడ్లలో అయోడిన్ మెండుగా ఉంటుంది. ఒక పెద్ద గుడ్డులో 24 మైక్రోగ్రాములు అయోడిన్ ఉంటుంది. ఇది రోజువారి అవసరాలలో 16% సరఫరా చేస్తుంది.



**గమనిక:** ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.





**అయోడిన్ లోపం...**

థైరాయిడ్ గ్రంథి పనితీరులో అయోడిన్ కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథి మన ఆహారం నుంచి థైరాయిడ్‌ను గ్రహిస్తుంది, హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తుంది. పెద్దవారికి.. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని సరిగ్గా నిర్వహించడానికి రోజుకు సుమారు 150 మైక్రోగ్రాముల అయోడిన్ అవసరం. అయోడిన్ లోపం, అధిక అయోడిన్ రెండూ థైరాయిడ్ పనితీరుకు అంతరాయం కలిగిస్తాయి. పనితీరును మెరుగుపరచుకోవడానికి.. అయోడిన్ రిచ్ ఫుడ్స్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వర్షాకాలంలో ముఖం...

# జిడ్డుగా ఉందా

### ఈ ప్యాక్స్ వేయండి..



వర్షాకాలం వచ్చినప్పుడు చర్మ సమస్యలు కూడా వస్తాయి. అలాంటప్పుడు ఎలాంటి చిట్కాలు పాటించాలి. ఏం చేయాలో ఈ ఆర్టికల్‌లో తెలుసుకోండి. వర్షాకాలమైనా, ఎండకాలమైనా స్కిన్ రొటీన్ చాలా ముఖ్యం. స్కిన్ ప్రాబ్లమ్స్‌కి మెయిన్ రీజన్ వెదర్ ఎఫెక్ట్ ఉంటుంది. ఆయిలీ స్కిన్ ఉన్నవారు చాలా సమస్యల్ని ఫేస్ చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా ఉంటుంది. జిడ్డుతో పాటు చర్మంలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. తేమ పెరగడం వల్ల చర్మ రంగు మారుతుంది. ఆ సమస్య తగ్గించు కునేందుకు కొన్ని ప్యాక్స్ ప్రయత్నిం చొచ్చు. దీని వల్ల మీ స్కిన్‌ని కాపాడుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.



**దోసకాయ..**(దోసకాయలో ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయి. చర్మ సమస్యల్ని దూరం చేయడంలో దోసకాయ రసం బాగా పనిచేస్తుంది. దీనిని అప్లై చేయడం వల్ల జిడ్డుతనం దూరమవుతుంది. దీనిని టోనర్‌లా కూడా చేసి వాడొచ్చు. మిక్సీలో, బ్లెండర్‌లో దోసకాయని వేసి గ్రైండ్ చేసి చర్మానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత క్లీన్ చేయండి.



**ఓట్మీల్ ప్యాక్..** ఓట్స్ కూడా చర్మానికి చాలా మంచిది. ఇవి మంచి ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తాయి. చర్మ మృతకణాలను తొలగించి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో ఓట్స్ బాగా పనిచేస్తాయి. అందుకోసం ఏం చేయాలంటే ఓ చిన్న గిన్నెలో ఆరెంజ్ పీల్ పౌడర్, ఎర్ర పప్పు పొడి, ఓట్స్ వేయండి. రోజ్ వాటర్ వేసి పేస్టులా చేయండి. ముఖంపై అప్లై చేసి ఆరిన తర్వాత క్లీన్ చేసుకోవాలి.


**పుదీనా..**

పుదీనా ఆకులు కూడా చర్మానికి చాలా మంచిది. కొన్ని పుదీనా ఆకుల్ని తీసుకుని దానిని పేస్టులా చేయాలి. అందులో ముల్తానీ మట్టి, తేనె, పెరుగు వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి అప్లై చేయాలి. ఆరిన తర్వాత క్లీన్ చేయాలి. దీని వల్ల స్కిన్ మెరుస్తుంది.

**నీమ్ ఫేస్ ప్యాక్..** వేపాకులో చర్మ సమస్యల్ని దూరం చేసే గుణాలు ఉన్నాయి. అనేక చర్మసమస్యలకి వేపాకుల్ని ఔషధంగా వాడొచ్చు. ఇందుకోసం ఏం చేయాలంటే ఓ చిన్న గిన్నెలో రెండు స్పూన్ల ముల్తానీ మట్టి, రెండు స్పూన్ల వేపాకుల రసం, రోజ్ వాటర్ వేయాలి. దీనిని బాగా కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. 20 నిమిషాల తర్వాత కడగాలి. దీని వల్ల మొటిమలు, జిడ్డుతనం దూరమవుతుంది.

**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.





# చిలగడదుంపతో... మచ్చలేని సౌందర్యం

**మనం తీసుకునే ఆహారం, మన సౌందర్య పోషణలో కీలక పాత్ర పోషిస్తుందని మనకు తెలుసు. ముఖ్యంగా మన డైట్‌లో తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటే వాటిలో సమృద్ధిగా ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, ప్రకాశ వంతంగా ఉంచుతాయని నిపుణులు చెబుతూ ఉంటారు. మీ అందాన్ని సంరక్షించుకో వడానికి, మీరు తీసుకునే ఆహారంలో రకరకాల కూరగాయలు తీసుకోవడం చాలా ముఖ్యం. సౌందర్య పోషణకు.. చిలగడదుంప సహాయపడు తుందని అంటున్నారు నిపుణులు. చర్మ ఆరోగ్యానికి మేలు చేసే.. అనేక పోషకాలు దీనిలో ఉన్నాయి. మీ అందాన్ని పెంపొందించడానికి.. చిలగడదుంపను ఎందుకు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.?**



**ఎండ దెబ్బతినకుండా కాపాడుతుంది...**

చిలగడదుంపలో బీటా - కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్‌గా మారుతుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విటమిన్ ఏ సూర్యరశ్మి కారణంగా చర్మకణాలు దెబ్బతిన కుండా రక్షిస్తుంది. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా రక్షిస్తుంది.?

**ప్రకాశవంతమైన చర్మం అందిస్తుంది...**

చిలగడదుంపలో బీటా - కెరోటిన్ అధికంగా ఉంటుందని మనకు తెలుసు. బీటా - కెరోటిన్ రిచ్ ఫుడ్స్ తరచూ తీసుకుంటే.. చర్మం మెరుస్తూ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదనంగా, చిలగడదుంపలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తాయి. దీర్ఘకాలిక చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

**యాంటీఏజింగ్ ఎఫెక్ట్...**

చిలగడదుంపలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. దీనికి యాంటీఏజింగ్ గుణాలుఉంటాయి. విటమిన్ సి కొల్లాజెన్ సంశ్లేషణలో కీలక పాత్ర పోషిస్తుంది, ఇది చర్మ స్థితిస్థాపకత, ఇతర అంశాలను ప్రభావితం చేస్తుంది. చిలగడదుంపలోని విటమిన్ ఏ ముడతలు, పొడి చర్మాన్ని నివారించడానికి సహాయపడుతుంది. మీరు మృదువైన, యవ్వనంగా చర్మం సొంతం చేసుకోవాలనుకుంటే.. మీ డైట్‌లో చిలగడదుంపను కచ్చితంగా చేర్చుకోండి.


**మచ్చలు మాయం...**

చిలగడదుంపలోని యాంథో సైనిన్స్‌కు యాంటీఆక్సిడెంట్, యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఈ గుణాలు నల్ల మచ్చలు, పొక్కులను నివారిస్తాయి. చిలగడదుంపలో క్యాన్సర్ నిరోధక గుణాలు కూడా ఉన్నాయని.. అధ్యయనాలు చెబుతున్నాయి.









## పనీర్ టిక్కి కావలసిన పదార్థాలు



పనీర్ తురుము: ఒక కప్పు, ఆలుగడ్డ: ఒకటి (పెద్దది), ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, క్యారెట్ తురుము: ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా, కారం: ఒక టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, ఆమ్‌చూర్: అర టీస్పూన్, అల్లం: అంగుళం ముక్క, ఉప్పు: తగినంత, మిరియాల పొడి: పావు టీస్పూన్, కార్న్‌ఫ్లోర్: అర కప్పు, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, బ్రెడ్ క్రంబ్స్: అర కప్పు, నూనె: వేయించడానికి సరిపడా, వాము: కొద్దిగా.


తయారీ విధానం ఒక గిన్నెలో పనీర్ తురుము, ఉడికించి మెదిపిన ఆలుగడ్డ ముద్ద, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి ముక్కలు, క్యారెట్, కొత్తిమీర తురుము, కారం, గరం మసాలా, ఆమ్‌చూర్, అల్లం తురుము, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలిపి నీళ్లు పోయ కుండా ముద్దలా చేయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి సరిపడా నూనె పోసి, వేడి చేయాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, వాము, కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి తగినన్ని నీళ్లు పోసి జారుగా కలపాలి. పనీర్ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అరచేత్తో టిక్కీల్లా ఒత్తుకుని ముందుగా మైదా మిశ్రమంలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్‌లో దొర్లించాలి. వీటిని దోరగా కాల్చుకుంటే వేడివేడి పనీర్ టిక్కీలు సిద్ధం.

## ఈ అలవాట్లతో అధిక రక్తపోటు ముప్పు..!



ఆధునిక జీవనశైలి కారణంగా పెద్దసంఖ్యలో ప్రజలు రక్తపోటు బారినపడుతున్నారు. హైబీపీ నియంత్రణలో లేకుంటే అది ఇతర అనారోగ్యాలకూ దారితీస్తుంది. బీపీ అదుపులో లేకుంటే హృద్రోగ ముప్పు వెంటాడుతుంది. బీపీని ఎప్పటికప్పుడు నియంత్రించుకోవడం అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే మనకు తెలియకుండానే మన అలవాట్లు బీపీని పెంచుతుంటాయి. శారీరక వ్యాయామం చేయనివారు, చురుకైన జీవనశశైలి అనుసరించని వారిలో అధిక రక్తపోటుతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. శారీరక వ్యాయామం లోపిస్తే అధిక బరువు పెరగడం, ఊబకాయం ఫలితంగా హైబీపీ వేధిస్తుంది. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు అరగంట సమయం వ్యాయామానికి వెచ్చిస్తే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా బరువు పెరగకుండా చూసుకోవచ్చు. వాకింగ్ లేదా ఇంట్లోనే తేలికపాటి వ్యాయామాలతో చురుకుగా ఉండవచ్చు. ఇక స్మోకింగ్, పొగాకు నమలడం, మద్యపానం బీపీని పెంచడమే కాకుండా క్యాన్సర్ ముప్పునూ ముందుకుతెస్తుంది. ఇక ఒత్తిడి బీపీని పెంచి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఎంతటి మనిషినైనా చిత్తు చేసే ఒత్తిడిని నివారించేందుకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ అనుసరించాలి. వీటితో పాటు కెఫీన్‌ను అధికంగా తీసుకోవడం, ఉప్పును మోతాదు మించి వాడటం హైబీపీకి కారణమవుతుంది.

## చికెన్ వింగ్స్



పావు కిలో, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్: ఒక టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, పసుపు: చిటికెడు, మిరియాల పొడి: పావు టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, వెన్న: రెండు టేబుల్ స్పూన్లు, నూనె: వేయించడానికి సరిపడా, సోయా సాస్: ఒక టీస్పూన్, రెడ్ చిల్లీ సాస్: ఒక టేబుల్ స్పూన్, వెనిగర్: ఒక టీస్పూన్, వేయించిన తెల్లనువ్వులు: అర టీస్పూన్.

తయారీ విధానం... చికెన్ వింగ్స్‌ను బాగా కడిగి ఉప్పు వేసిన నీళ్లలో గంటపాటు నానబెట్టాలి. ఒక గిన్నెలో చికెన్ వింగ్స్, కారం, గరం మసాలా, పసుపు, మిరియాల పొడి, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా కలిపి అరగంటపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, చిటికెడు ఉప్పు వేసి చికెన్ వింగ్స్ జోడించి.. నీళ్లు పోయకుండా వాటికి పిండి పట్టించాలి. కడాయిలో నూనె వేడయ్యాక చికెన్ వింగ్స్ వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత, స్టవ్ మీద పాన్ పెట్టి వెన్న వేసి.. బాగా వేడయ్యాక రెడ్‌చిల్లీ సాస్, సోయా సాస్, వెనిగర్, ఉప్పు కలపాలి. ఆ మిశ్రమం ఉడుకుతుండగానే వేయించిన వింగ్స్ వేయాలి. తర్వాత, రెండు నిమిషాలు ఎక్కువ మంటపై వేయించాలి. పైనుంచి వేయించిన నువ్వులు చల్లుకుంటే వేడివేడి చికెన్ వింగ్స్ సిద్ధం.


# చందన

### కొబ్బరిని కూరల్లో వేయడం

## ఆరోగ్యానికి మంచిదేనా



**కొబ్బరినూనె, కొబ్బరి ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని ఎలా వాడితే మంచిదో తెలుసుకోండి. కొబ్బరిని కూరల్లో వేయడం ఆరోగ్యానికి మంచిదేనా.. సాధారణంగా కొబ్బరినూనె ఆరోగ్యానికి మంచిది. కేరళ ప్రజలు దీనిని ఎక్కువగా వాడతారు. అయితే, దీనిని వాడడం మంచిది కాదని కొంతమంది భయపడతారు. అందులో నిజం ఉందా లేదా తెలుసుకోండి.**




ఆరోగ్యానికి కొబ్బరి.. కొబ్బరి ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని తక్కువగా వాడాలి. కొబ్బరి కూరల్లో వేస్తే బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంది. ఇందులో పీచు పదార్థం ఉంటుంది. అది ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి పాలలో యాంటీ ఆక్సిడెంట్ అందించే లారిక్ యాసిడ్ కూడా ఇందులో ఉంటుంది. కానీ, కొబ్బరిని పాలలా చేసినప్పుడు ఫైబర్ తగ్గుతుంది. ఎలా వాడాలి.. కొబ్బరిని ఫ్రై చేసి తినడం మంచిది కాదు. ఎందుకంటే కొబ్బరిని వేడి చేసినప్పుడు అందులోని సుగంధ పాలీసైక్లిక్ హైడ్రోకార్బన్స్ ఏర్పడతాయి. కొబ్బరిని కాల్చినప్పుడు ఎర్రగా అయిపోతుంది. దీని వల్ల అసిడిటీ, గుండెల్లో మంట, పేగు సమస్యలు వస్తాయి. కాబట్టి, దీన్ని తక్కువగా తీసుకోవాలి. దీంతో త్వరగా బరువు తగ్గుతారు.

మధుమేహం ఉన్నవారికి ఆర్థరైటిస్ ఉంటే ఈ లక్షణాలుంటాయ్...?



మొత్తంగా.. మొత్తంగా కొబ్బరి ఆరోగ్యానికి మంచిది. అలా అని ఎక్కువగా తినడం, ఫ్రై చేసి తినడం అంత మంచిది కాదు. కొద్ది పరిమాణంలో అది కూడా అలానే తినడం మంచిది. దీనిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.



బాడీలో కొలెస్ట్రాల్ పెరిగితే ఈ లక్షణాలు ఉంటాయ్..?

కొబ్బరి తురుము, పాలు.. కొబ్బరి తురుము వేసినా పాలను తక్కువగా వేయడం మంచిది. ఇది శరీరానికి శక్తిని అందించగలదు. ఇందులో మాంగనీస్, సెలీనియంలు ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఆరోగ్యకరమైన ఆహారం కూడా. ఇది చెడు కొలెస్ట్రాల్‌ని పెంచి మంచి కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది కాబట్టి, ఇందులోని కొవ్వు వల్ల కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. ఇక కొబ్బరి పాలు, కొబ్బరితో ఫుడ్ చేసి తింటే త్వరగా ఆకలి అవుతుంది.





# కొత్త ట్రెండ్...

## చినుకు అందం!



క్రాప్‌టాప్ స్కర్టూ ఫ్యాషన్ ఇంకా నడుస్తూనే ఉంది. చీరలూ స్కర్టుల మీద లాంగ్ కోట్ వేసుకునే ట్రెండ్ కూడా కనిపిస్తూనే ఉంది. అయితే అవి మరీ బోరయిపోయాయి అనుకున్నారేమో ఆ రెండింటినీ కలుపుతూ మరో కొత్త ఫ్యాషన్‌ని సృష్టించేశారు డిజైనర్లు... అదే క్రాప్‌టాప్- ప్యాంట్ విత్ కోట్. ఈ తరం అమ్మాయిలకు సౌకర్యంగానూ ఉంటుంది... సంప్రదాయ వేడుకలూ పార్టీల్లో వేసుకునేలా కాస్త ఆడంబరంగానూ కనిపిస్తుందన్నమాట. అందుకే నిన్నమొన్నటివరకూ వెడల్పాటి స్కర్టులతో మెరిసిన క్రాప్ టాప్, ఇప్పుడు కోటుని జతచేసుకుని మరీ ప్యాంట్‌తో వచ్చేసింది అంటున్నారు సదరు ఫ్యాషన్ నిపుణులు. పైగా ప్యాంటూ టాప్‌లకు అనుగుణంగా కోటునీ మ్యాచయ్యేలా డిజైన్ చేస్తున్నారు. ఇంకేముందీ... అమ్మాయిలే కాదు, కొత్త తరం అమ్మలు కూడా కార్పొరేట్ పార్టీలూ చిన్నపాటి వేడుకలకు ఎంచక్కా ఈ కోట్ ప్యాంట్‌లతో హాజరైపోతున్నారు.

చినుకు అందం!.. ఆకులమీదో లేదా కిటికీ అద్దాలమీదో నిలిచిన వాన చినుకుల అందాన్ని చూసి పరవశించిపోయేవాళ్లు చాలామందే ఉంటారు. ఆ చినుకు సౌందర్యం మనం వేసుకునే నెయిల్ పాలిష్, షూ, బ్యాగులూ, దుస్తులమీద కూడా కనిపిస్తే ఇంకెంత బాగుంటుందో అనుకున్నట్లున్నారు డిజైనర్లు. వాళ్లకి ఆ ఊహ రావడమే ఆలస్యం అన్నట్లుగా అవన్నీ కూడా రెయిన్ డ్రాప్ డిజైన్‌తో చూడచక్కగా మెరిసేలా తయారుచేసేస్తున్నాయి ఆయా సంస్థలు. బట్టలూ, షూ... వంటి వాటిమీద త్రీడీ ప్రింటింగ్ ద్వారా వర్షపు బిందువులు కనిపించేలా డిజైన్ చేస్తే, గోరుకు వేసుకునే నెయిల్ పాలిష్‌పైన కూడా నీటి బిందువులు కనిపించడం అన్నది మాత్రం ఆయా వ్యక్తుల నైపుణ్యమే అని చెప్పాలి. ఇందుకోసం ముందుగా పాలిష్ వేశాక సన్నని బ్రష్‌తో పారదర్శక నెయిల్‌పెయింట్ లేదా ఆ రంగు పెయింట్‌నే చుక్కలుగా పెడుతున్నారు. దాంతో అచ్చం గోటిమీద వాన కురిసినట్లే కనిపిస్తుంటుంది. బాగుంది కదూ!

**కాలుకి నల్లతాడు!...** పిల్లలకు దిష్టి తగలకుండా ఉంటుందని మెడలోనో లేదా చేతికో నల్లతాడు కట్టడం అందరికీ తెలిసిందే. వీటికే కొందరు పూసల్నీ, కాస్త స్తోమత ఉన్నవాళ్లయితే బంగారు గుండ్లనీ గుచ్చుతుంటారు. అయితే ఈమధ్య ఆ దిష్టి తాళ్లనే రకరకాల డిజైన్లతో చేయించి మరీ పిల్లలకి పెడుతున్నారు. పెద్దవాళ్లు సైతం వీటిని బ్రేస్‌లెట్ మాదిరిగా పెట్టుకుంటున్నారు. అక్కడితో ఆగితే చెప్పుకునేదేముందీ... తాజాగా కాళ్లకి సైతం నల్లతాడు కట్టుకోవడం ఫ్యాషన్‌గా మారింది. బ్లాక్ థ్రెడ్ యాంక్లెట్, లేదా ఈవిల్ ఐ యాంక్లెట్‌గా యువతలో ప్రాచుర్యం పొందిన వీటిని కొందరు రెండు కాళ్లకీ పెడుతుంటే, ఎక్కువమంది ఒక్క కాలుకే పెడుతున్నారు. దాంతో ఇవి కాస్త అందంగా కనిపించేలా బంగారం, వెండితో చిన్నపాటి లాకెట్లనీ అమర్చి మరీ డిజైన్ చేసేస్తున్నారు ఉత్పత్తిదారులు.







# తివిరి ఇసుమున

## తైలంబు తీయవచ్చు



అదో రైతు కూలీ కుటుంబం. ఆ కూలీబతుకులొద్దని చదువుకున్న ఆయన... ప్రభుత్వ ఇంజినీరయ్యాడు. రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బుతో 80 ఎకరాలు కొన్నాడు! 'ఇంకేం... భూస్వామి కదా!' అనుకుంటున్నారేమో... ఆయన కొన్నది రాజస్థాన్ ఎడారిలో! భూములున్నాయన్న పేరు తప్ప దానితో పెద్దగా ఒరిగేదేమీ లేదు. కానీ ఆయన కొడుకు అలా ఊరుకోలేదు. అక్కడ అసలు సాగులేని కలబంద వ్యవసాయాన్ని చేపట్టి... మనదేశంలోని కోటీశ్వరులైన రైతుల్లో ఒకడయ్యాడు. ఆ కథేమిటో చూస్తారా... 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు...' అంటూ సాగే సుభాషితం ఒకటుంది. ప్రయత్నిస్తే ఇసుక నుంచీ నూనె తీయొచ్చు అన్నది దానర్థం. భర్తృహరి చెప్పిన ఈ మాట హరీశ్ ధన్‌దేవ్‌కి సరిగ్గా సరిపోతుంది. పట్టుదల ఉండాలేకానీ ఎడారి ఇసుకలోనూ సిరులు పండించొచ్చని నిరూపిస్తున్నాడతను. 'నేచర్‌లో ఆగ్రో' పేరుతో మనదేశంలో కలబందకంటూ ఓ బ్రాండ్‌ని సృష్టించాడు. ఆ ఔషధ మొక్కని ప్రాసెస్ చేసి మనదేశంలోని పతంజలి ఆయుర్వేద సంస్థతోపాటూ విదేశాలకీ భారీ ఎత్తున ఎగుమతులు చేస్తున్నాడు. ఏటా మూడుకోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్నాడు. ఆ మధ్య కిసాన్ జాగరణ్ నిర్వహించిన సర్వేలో -దేశంలోని కోటీశ్వరులైన రైతుల్లో మూడోస్థానం సొంతం చేసుకున్నాడు! ఇదంతా ఎలా మొదలైందంటే... జైసల్మేర్... ఈ పేరు వినగానే మనకి రాజస్థాన్ థార్ ఎడారే గుర్తొస్తుంది. ఎడారంటే అక్కడక్కడా ఒయాసిస్సులూ ఉంటాయికదా! వాటి దగ్గర కొద్దోగొప్పో వ్యవసాయం జరుగుతూ ఉంటుంది. అక్కడ పెసర, గోధుమ, ఆవ పంటలు వేస్తుంటారు. అలా పండించే వ్యవసాయదారుల వద్ద ఎన్నో తరాలుగా రైతుకూలీలుగా ఉంటూ వస్తోంది 'ధన్‌దేవ్'ల కుటుంబం. అందరు రైతుకూలీల్లాగే ఏదో ఒకరోజు తామూ రైతులు కావాలన్న కల వాళ్ళకుండేది. కానీ నాటి సామాజిక పరిస్థితుల వల్ల అది సాధ్యం కాలేదు. ఆ కుటుంబానికి చెందిన రూపారామ్ చదువు వైపు వెళ్ళాడు. కష్టపడి ఇంజినీరింగ్ చదివి ప్రభుత్వోద్యోగం సాధించాడు. ఆయనకి ఆరుగురు అమ్మాయిలూ, ఒకబ్బాయి. అమ్మాయిలందరూ చక్కగా చదువుకుని డాక్టర్లూ, ఇంజినీర్లయ్యారు. పెద్దమ్మాయి అంజన మేయర్‌గానూ ఎంపికైంది! చివరివాడైన హరీశ్ ధన్‌దేవ్ బీటెక్ చేసి... జైసల్మేర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజినీరయ్యాడు. అప్పటికే తండ్రి రూపారామ్ రిటైరయ్యాడు. తన తాతతండ్రులు ఒకప్పుడు- కూలీలుగా ఉంటూ రైతులుగా బతకాలని కలలు కన్న విషయం అతని మనసులో ఉండిపోయింది. దాన్ని తానైనా నెరవేర్చాలనుకుని జైసల్మేర్ శివారులో 80 ఎకరాల పొలం కొన్నాడు. 'ఎడారి ప్రదేశంలో అంత భూమి కొనడం అవసరమా... మరీ చోద్యం కాకపోతే' అన్నారు అందరూ. కానీ, ఆయన పట్టించుకోలేదు. తనకి తీరిక దొరికినప్పుడల్లా ఆ పొలాలకెళ్ళి సాగుచేస్తుండేవాడు. తండ్రి ఒంటరిగా శ్రమపడటం చూసిన హరీశ్ కూడా అప్పుడప్పుడూ వెళ్లి సాయపడసాగాడు. కానీ తన తండ్రే కాదు... ఇతర రైతుల్లోనూ మార్కెట్‌పైన సరైన అవగాహనకానీ, ప్లానింగ్‌కానీ లేకపోవడాన్ని గమనించాడు హరీశ్. అవన్నీ వాళ్ళకి వివరించసాగాడు. మెల్లగా- అతనికీ సాగుపైన ఆసక్తి కలిగింది. ఓసారి దిల్లీలో జరిగిన సదస్సులో బికనీర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు థార్ ఎడారిలో కలబంద సాగు చేయడం మంచిదని చెప్పారట. హరీశ్ ఎంతో ఆసక్తితో బికనీర్ వర్సిటీకి వెళ్ళి దానిపైన శిక్షణ తీసుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న కలబంద సాగు పోకడల్ని ఇంటర్నెట్‌ద్వారా అధ్యయనం చేశాడు. తండ్రి నుంచి 15 ఎకరాలు తీసుకుని... 80 వేల మొక్కలతో సాగు మొదలుపెట్టాడు. తొలి ఏడాది దిగుబడిని రాజస్థాన్‌లోని కొన్ని కంపెనీలకి అమ్మాడు. లాభాలు బాగానే వచ్చాయి కానీ హరీశ్ అంతటితో సంతృప్తిపడే రకం కాదు..!

**ప్రాసెసింగ్ యూనిట్...** మొదటి ఏడాది తన దగ్గర కలబంద కొనుగోలు చేసిన కంపెనీలు వాటి గుజ్జుతీసి... మూడురెట్ల ఎక్కువ ధరకి అమ్ముతున్నట్లు తెలుసుకున్న హరీశ్... 'ఆ ప్రాసెసింగ్ పనేదో మనమే చేయొచ్చుకదా!' అనుకున్నాడు. కేవలం ప్రాసెసింగ్‌తోనే ఆగకుండా ఓ బ్రాండ్‌నీ సృష్టిస్తే విదేశాలకీ ఎగుమతి చేయొచ్చని తెలుసుకున్నాడు. ఈలోపు- వ్యవసాయం చేయడంలో ఉన్న సవాళ్ళూ, వాటిని అధిగమించడంలో ఉన్న సంతృప్తీ హరీశ్‌కి తెలిసొచ్చింది. అది తన ప్రభుత్వోద్యోగంలో లేదనుకున్నాడు. మరే ఆలోచనాలేకుండా రాజీనామా చేసి... 'నేచర్‌లో ఆగ్రో' అన్న కంపెనీని స్థాపించాడు. హాంకాంగ్, అమెరికా, బ్రెజిల్ దేశాల్లోని కాస్మెటిక్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని తాము ప్రాసెస్ చేసిన కలబంద గుజ్జుని విక్రయించసాగాడు. ఆ తర్వాత పతంజలి సంస్థ... తమ కలబంద జ్యూస్ తయారీకి కావాల్సిన ముడిసరకు కోసం 'నేచరలో' సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో- 15 ఎకరాల కలబంద సాగు రెండో ఏడాదికే 120 ఎకరాలకి చేరింది. 80 వేల మొక్కలతో మొదలుపెట్టిన వ్యవసాయం... ఏడు లక్షల మొక్కలకు పెరిగింది! 'నేచర్‌లో'... కలబంద సాగుకి తొలి బ్రాండ్‌గా మారింది. హరీశ్ మనదేశంలో కలబందని అత్యధిక మొత్తంలో సాగుచేస్తున్నవాడిగా పేరుతెచ్చుకున్నాడు. తన పూర్వీకులు కూలీగా చేసిన ఎడారి భూముల్లోనే... మోతుబరి రైతుగా కోట్లకు పడగలెత్తాడు!

# కిచిడీ...కమ్మగా హాయిగా!

అన్నం, పప్పు, కూర... వంటివన్నీ చేసుకోవడానికి బద్ధకంగా అనిపించినప్పుడు వెంటనే పులావ్, బిర్యానీ లాంటివి ప్రయత్నిస్తాం కదూ. అవి కూడా ఎప్పుడూ ఉండేవే అనుకున్నప్పుడు ఈ కిచిడీ రకాలను వండుకుంటే సరి.


బియ్యం- సెనగపప్పుతో... కావలసినవి: బాస్మతీ బియ్యం: ఒకటిన్నర కప్పు, సెనగపప్పు: ముప్పావుకప్పు (ముందుగా నానబెట్టుకోవాలి), నెయ్యి: పావుకప్పు, నూనె: రెండు చెంచాలు, బిర్యానీఆకు: ఒకటి, దాల్చినచెక్క: చిన్న ముక్క, యాలకులు: రెండు, లవంగాలు: నాలుగు, అల్లంవెల్లుల్లి పేస్టు: చెంచా, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి: రెండు, ఉల్లిపాయ: ఒకటి, క్యారెట్: ఒకటి, పుదీనా ఆకులు: అరకప్పు, కొత్తిమీర తరుగు: పావుకప్పు, నిమ్మరసం: చెంచా, ఉప్పు: తగినంత. తయారీ విధానం: స్టవ్‌మీద కుక్కర్‌ను పెట్టి నెయ్యి, నూనె వేయాలి. ఇందులో బిర్యానీ ఆకు, దాల్చినచెక్క, యాలకులు, లవంగాలు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు అల్లంవెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేయించుకుని క్యారెట్ తరుగు, పుదీనాఆకులు, కొత్తిమీర తరుగు, తగినంత ఉప్పు, కడిగిన బియ్యం, నానబెట్టుకున్న సెనగపప్పు, నిమ్మరసం, నాలుగున్నర కప్పుల నీళ్లు పోసి మూత పెట్టాలి. మూడు కూతలు వచ్చాక స్టవ్‌ని కట్టేయాలి.

**గోధుమరవ్వతో...** కావలసినవి: గోధుమరవ్వ: కప్పు, పెసరపప్పు: పావుకప్పు, నెయ్యి: పావుకప్పు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, లవంగాలు: రెండు, ఎండుమిర్చి: రెండు, కరివేపాకు రెబ్బలు: రెండు, పచ్చిమిర్చి: రెండు, అల్లం తరుగు: చెంచా, ఉల్లిపాయలు: రెండు, బఠాణీ: పావుకప్పు, క్యారెట్: ఒకటి, బీన్స్ ముక్కలు: పావుకప్పు, బంగాళాదుంప: ఒకటి, పసుపు: పావుచెంచా, ఉప్పు: తగినంత, కొత్తిమీర తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు. తయారీ విధానం: స్టవ్‌మీద కుక్కర్‌ను పెట్టి... నెయ్యి వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, లవంగాలు వేసి వేయించుకోవాలి. ఆ తరువాత కరివేపాకు, పచ్చిమిర్చి, అల్లం తరుగు కూడా వేయించి ఉల్లిపాయ ముక్కలు, బఠాణీ, క్యారెట్ తరుగు, బీన్స్ ముక్కలు, బంగాళాదుంప ముక్కలు వేసి కలపాలి. తరువాత గోధుమరవ్వ, పెసరపప్పు, పసుపు, తగినంత ఉప్పు వేసి కలిపి రెండున్నర కప్పుల నీళ్లు పోసి మూత పెట్టాలి. రెండు కూతలు వచ్చాక స్టవ్‌ని కట్టేసి.. వడ్డించేముందు కొత్తిమీర వేయాలి.

**పెసలతో...** కావలసినవి: బియ్యం: కప్పు, పెసల మొలకలు: కప్పు, నెయ్యి: పావుకప్పు, బిర్యానీ ఆకు: ఒకటి, దాల్చినచెక్క: చిన్న ముక్క, లవంగాలు: మూడు, జీలకర్ర: ఒకటిన్నర చెంచా, పచ్చిమిర్చి: రెండు, అల్లం తరుగు: చెంచా, ఎరుపు - ఆకుపచ్చ రంగు క్యాప్సికం: ఒక్కోటి చొప్పున, ఇంగువ: చిటికెడు, కొబ్బరిపాలు: కప్పు, పుదీనా ఆకులు: పావుకప్పు, ఉప్పు: తగినంత.


**తయారీ విధానం:** స్టవ్‌మీద కడాయిని పెట్టి నెయ్యి వేయాలి. అది వేడెక్కాక బిర్యానీ ఆకు, దాల్చినచెక్క లవంగాలు, జీలకర్ర వేసి వేయించుకోవాలి. తరువాత పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు వేయించి ఎరుపు- ఆకుపచ్చ రంగు క్యాప్సికం ముక్కలు, ఇంగువ వేసి కలపాలి. రెండుమూడు నిమిషాలయ్యాక పెసల మొలకలు, కడిగిన బియ్యం, తగినంత ఉప్పు, పుదీనా ఆకులు, ఒకటిన్నర కప్పు నీళ్లు, కొబ్బరిపాలు వేసి బాగా కలిపి మూత పెట్టాలి. అన్నం ఉడికి... కిచిడీ దగ్గరకు అయ్యాక దింపేయాలి.

**సగ్గుబియ్యంతో...** కావలసినవి: సగ్గుబియ్యం: కప్పు, అటుకులు: అరకప్పు, నూనె: రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, జీడిపప్పు: పావుకప్పు, పచ్చిమిర్చి: రెండు, కరివేపాకు రెబ్బలు: మూడు, వేయించిన పల్లీలు: కప్పు, బంగాళాదుంప ముక్కలు: అరకప్పు, క్యారెట్ తరుగు: అరకప్పు, ఉప్పు: తగినంత, కొబ్బరిపొడి: టేబుల్‌స్పూను. తయారీ విధానం: సగ్గుబియ్యాన్ని మూడునాలుగు గంటల ముందు నానబెట్టుకుని ఆ తరువాత నీటిని పూర్తిగా వంపేయాలి. అలాగే అటుకుల్ని ఓసారి నీటిలో వేసి... రెండు నిమిషాలయ్యాక గట్టిగా పిండి తీసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, జీడిపప్పును వేయించుకో వాలి. తరువాత సన్నగా తరిగిన పచ్చిమిర్చి, కరివేపాకు, పావుకప్పు పల్లీలు, బంగాళాదుంప ముక్కలు, క్యారెట్ తరుగు వేసి అన్నింటినీ వేయించాలి. ఇందులో సగ్గుబియ్యం, అటుకులు, తగినంత ఉప్పు, మిగిలిన పల్లీలతో బరకగా చేసిన పొడి, కొబ్బరిపొడి వేసి కలిపి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. అడుగు అంటకుండా మధ్యమధ్య కలుపుతూ ఉండి... సగ్గుబియ్యం మెత్తగా అయ్యాక దింపేయాలి.ని









## మీ ముఖం తెల్లగా కాంతివంతంగా

# ఉండాలంటే



ఇంటిపట్టున ఉంటే ముఖం బాగున్నట్లు బయటతిరుగుతుంటే కాస్త నల్లబడుతున్నట్లు అనిపిస్తుంది. పైగా అందరూ ఎందుక అలా నల్లపూస వైపుతున్నావు అని కామెంట్ చేసిన చాలా బాధనిపి స్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉద్యోగాలని, చదువులని బయటకు వెళ్లని తప్పని స్థితి అలాంట ప్పుడు మన ఇంట్లో ఉండే ఈ చిట్కాలతో ముఖాన్ని కాంతివంతంగా చేసుకోవచ్చు అవేమిటో చూస్తేద్దామా టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడినీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చిపాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పది నిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల తేమ అంది, చర్మం పట్టులా నిగారింపుతో మెరుపులీనుతూ కనిపిస్తుంది. మన కూరల్లో వాడే జీలకర్ర ముఖవర్ఛస్సుకు చాలా బాగా ఉపయోగపడుతుంది. జీకర్ర రెండు కప్పుల నీళ్లో మరిగించి ఆ నీటితో ముఖం కడుక్కుంటే వృద్ధాప్య లక్షణాలను నివారిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ 'ఈ' వృద్ధాప్యానికి కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను ఎదుర్కోవడానికి యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. అంతే కాదు! జీలకర్ర గింజలు మొటిమలు, వాటి తాలుకా మచ్చలు, తామర, సోరియాసిస్ వంటి చర్మ రుగ్మతలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. టాక్సిన్స్‌ను కూడా తొలగిస్తుంది తద్వారా చందమామలాంటి ప్రకాశవం తమైన ముఖం మీ సొంతం అవుతుంది. మంచి ఫలితాల కోసం క్రమం తప్పకుండా చేయండి. అలాగే ముఖం అందంగా ఉన్న జుట్టు డల్‌గా ఊడిపోతున్న అందంగా కనిపించరు కదా వీటితో పాటు మీ మిమల్ని మరింత అందంగా కనిపించేలా చేసేందుకు మీ శిరోజాలను ఈ చిట్కాతో సంరక్షించుకోండి.

**జుట్టు రాలడాన్ని తగ్గించే డికాషన్....**మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. తరువాత చల్లారనిచ్చి వడగట్టి డికాషన్‌ను సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

# వానాకాలం నొప్పులెందుకో..

కొందరికి వానాకాలంలో కీళ్ల నొప్పులు తలెత్తుతుంటాయి. దీనికి కారణమేంటన్నది కచ్చితంగా తెలియదు. పరిశోధనల్లోనూ స్పష్టంగా బయటపడలేదు. కొన్ని పరిశోధనలు అవునంటే, కొన్ని కాదంటున్నాయి. అయితే వాతావరణంలో మార్పులు కీళ్ల నొప్పులకు కారణం కావొచ్చని నిపుణులు భావిస్తుంటారు. వానలు కురవటానికి ముందు వాతావరణంలో గాలి పీడనం తగ్గుతుంది. అప్పుడు శరీరం మీద గాలి పీడనం తక్కువగా పడుతుంది. ఫలితంగా కండరాలు, కండర బంధనాలు, కీళ్ల చుట్టూ ఉండే ఇతర కణజాలాలు వ్యాకోచిస్తాయి. దీంతో కీళ్ల మీద ఒత్తిడి పెరిగి నొప్పికి దారితీయొచ్చు. కీళ్లనొప్పులు, ఇతరత్రా దీర్ఘకాల నొప్పులతో బాధపడేవారు ఇలాంటి అసౌకర్యానికి గురవుతుంటారు. వాతావరణం సద్దుమణిగాక గాలి పీడనమూ సర్దుకుంటుంది. నొప్పులూ తగ్గుతాయి. ఇదొక్కటే కాదు, ఇతరత్రా అంశాలూ నొప్పులకు కారణం కావొచ్చు. వానలు పడుతున్నప్పుడు బయటకు వెళ్లటం కుదరకపోవచ్చు. ఎక్కువసేపు ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. ఎక్కువసేపు కదలకుండా కూర్చుంటే కండరాలు, కీళ్లు బిగుసుకుపోయి నొప్పి పుట్టొచ్చు. ఆకాశం మబ్బు పట్టినప్పుడు మూడ్ కూడా మారిపోవచ్చు. నొప్పుల వంటి ప్రతికూల అంశాల మీదికి దృష్టి మళ్లొచ్చు. నొప్పుల గురించి ఆలోచిస్తుంటే అవి మరింత ఎక్కువవుతాయి కూడా. 'వానలు పడుతున్నాయి, ఇక నొప్పులు మొదలవుతాయి' అనే భావన కూడా నొప్పులు తీవ్రం కావటానికి కారణం కావొచ్చు.

తగ్గించుకునేదెలా? పరిశోధనల్లో రుజువైనా, కాకపోయినా వాతావరణం మారినప్పుడు కీళ్ల నొప్పులు వేధిస్తుంటే ఉపశమనం కోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీంతో కండరాలు, ఎముకలు బలోపేతమై కీళ్ల మీద ఒత్తిడి తగ్గుతుంది. ఒకేదగ్గర కూర్చోవటం కన్నా అటూఇటూ నడవటం మేలు. ఆరుబయటకు వెళ్లటం కుదరకపోతే ఇంట్లోనైనా నడవాలి. ట్రెడ్‌మిల్ మీద నడిచినా మంచిదే. బరువు పెరిగితే కీళ్లు, మోకీళ్లు, తుంటి మీద ఎక్కువ భారం పడుతుంది. నొప్పులూ పెరుగుతాయి. కాబట్టి అధిక బరువుంటే తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. మామూలు బరువుతో ఉంటే పెరగకుండా చూసుకోవాలి. నొప్పులు తగ్గటానికి వేడి కాపడం తోడ్పడుతుంది. గోరు వెచ్చటి నీటిని సీసాలో పోసి, నొప్పి ఉన్నచోట అద్దుకోవచ్చు. తువ్వాలును వేడి నీటిలో ముంచి, పిండి అయినా అద్దొచ్చు. వీలుంటే హీటింగ్ ప్యాడ్స్ వాడుకోవచ్చు. గోరు వెచ్చటి నీటితో స్నానం చేసినా ఉపశమనం లభిస్తుంది. ఒంట్లో నీటి శాతం తగ్గితే కీళ్ల కదలికలు సరిగా సాగవు. కాబట్టి వానాకాలమైనా తగినంత నీరు తాగాలి. రోజంగా అప్పుడప్పుడూ నీరు తాగటం మరీ మంచిది.

## జీవక్రియా వేగాన్ని...

# పెంచేదెలా?

పనులు, వ్యాయామం చేస్తున్నప్పుడే కాదు.. కూర్చున్నప్పుడు, విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, చదువుతున్నప్పుడు కూడా ఒంట్లో కేలరీలు ఖర్చవుతాయి. ఇదో నిరంతర ప్రక్రియ. గుండె కొట్టుకోవటం, శ్వాస తీసుకోవటం వంటి పనులన్నింటికీ శక్తి అవసరం. ఇందుకోసం శరీరం కేలరీలను వినియోగించుకుంటుంది. ఇలా శరీరం నిరంతరం కేలరీలను వినియోగించుకోవటాన్ని జీవక్రియ (మెటబాలిజమ్) అంటాం. మరి దీన్ని పెంచుకునే మార్గమేదైనా ఉందా? శరీరం పనిచేయటానికి అవసరమైన కనీస కేలరీల సంఖ్యను మూల జీవక్రియా వేగం (బేసల్ మెటబాలిక్ రేట్- బీఎంఆర్) అంటారు. ఇది అందరిలో ఒకేలా ఉండదు. వయసు, ఎత్తు, బరువు, ఆడ, మగ, కండరం-కొవ్వు నిష్పత్తి, జన్యువుల వంటి వాటిని బట్టి మారిపోతూ ఉంటుంది. ఆన్‌లైన్‌లో కనిపించే చాలా బీఎంఆర్ కాలిక్యులేటర్లు హారిస్ బెనెడిక్ట్ సూత్రం ప్రకారం మూల జీవక్రియా వేగాన్ని పేర్కొంటాయి. స్మార్ట్‌వాచ్‌ల వంటివీ ఈ సూత్రం ప్రకారమే రోజుకు ఎన్ని కేలరీలను ఖర్చు చేస్తున్నామో చూపిస్తాయి. ఇలాంటి టూల్స్, పరికరాలు పేర్కొనే జీవక్రియా వేగం ఉజ్జాయింపే గానీ అదే కచ్చితమని అనుకోవటానికి లేదు. సాధారణంగా విశ్రాంతి సమయంలో నిమిషానికి ఒక కేలరీ ఖర్చవుతుందని చెప్పుకోవచ్చు. చాలామందిలో రోజుకు ఖర్చయ్యే కేలరీల్లో 60% నుంచి 70% వరకు మూల జీవక్రియా సూచికి సంబంధించిందే. మిగతా కేలరీలు నడవటం, రోజువారీ పనులు చేస్తున్నప్పుడు వినియోగమవుతాయి. అదే వ్యాయామం చేసినట్టయితే ఇంకాస్త ఎక్కువగా కేలరీలు ఖర్చవుతాయి.



**కండర వృద్ధితో పెంపు...** మూల జీవక్రియా వేగాన్ని పెంచుకోవచ్చు. ఇందుకోసం చేయాల్సిందల్లా కండరాల మోతాదును పెంచుకోవటం. శరీరం ఎక్కువ శక్తిని వినియోగించుకోవటానికి కండరాలు తోడ్పడతాయి. కండర మోతాదు ఎక్కువగా ఉంటే విశ్రాంతి సమయంలోనూ కేలరీలు అధికంగా ఖర్చవుతాయి. అందువల్ల బరువు తగ్గటానికి ప్రయత్నించేవారు కండరాన్ని కాపాడుకోవటం చాలా ముఖ్యం. బరువు తగ్గే ప్రయత్నంలో కండర మోతాదు తగ్గితే జీవక్రియా వేగమూ నెమ్మదిస్తుంది. దీంతో బరువు తగ్గటం అటుంచి, పెరిగే ప్రమాదముంది. కాబట్టి వ్యాయామం చేయటం మంచిది. ఇది కేలరీలు ఖర్చవ్వటానికే కాదు.. శక్తిని వినియోగించుకునే కండరాలు పుంజుకోవటానికీ తోడ్పడుతుంది. తగినంత ప్రొటీన్ తినటమూ ముఖ్యమే. ఇంది కండర వృద్ధికి దోహదం చేస్తుంది. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవాలి. కంటి నిండా నిద్రపోవాలి.

# అల్పాహారం 8 గంటల్లోపే!



ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామన్నదీ ముఖ్యమే. ఉదయం అల్పాహారం విషయంలో దీనికి మరింత ప్రాధాన్యముందని ఐఎస్‌గ్లోబల్ అధ్యయనం పేర్కొంటోంది. ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారితో పోలిస్తే ఉదయం 8 గంటల్లోపే టిఫిన్ తిన్నవారికి మధుమేహం ముప్పు 59% వరకు తగ్గుతున్నట్టు తేలింది మరి. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ చేయకపోవటం, పొగ తాగటం వంటి కారకాలు టైప్ 2 మధుమేహం ముప్పు పెరిగేలా చేస్తుంటాయి. వీటికిప్పుడు మరోటీ జోడించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అదే ఆహారం తినే సమయం. నిజంగానే తిండి వేళలు జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్), రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ మోతాదుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కొన్ని అధ్యయనాలే తిండి వేళల మీద దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో ఆహార వేళల మధ్య ఎడమ, తినే సమయం, టైప్2 మధుమేహం మధ్య సంబంధాన్ని గుర్తించటానికి ఐఎస్‌గ్లోబల్ పరిశోధకులు ప్రయత్నించారు. మొత్తం 1,03,312 మంది ఆహార అలవాట్లను విశ్లేషించారు. తొలి రెండేళ్ల సగటు ఆహార పద్ధతుల ఆధారంగా ఏడేళ్లకు పైగా వారి ఆరోగ్య తీరుతెన్నులను పరిశీలించారు. వీరిలో కొత్తగా 963 మంది మధుమేహం బారినపడగా.. రోజూ ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారికి ముప్పు గణనీయంగా ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. శారీరకంగా చూస్తే ఇది సబబే. ఎందుకంటే అల్పాహారం మానేయటం వల్ల గ్లూకోజు, కొలెస్ట్రాల్ నియంత్రణ గతి తప్పుతుంది. ఇన్సులిన్ హార్మోన్ మోతాదులూ అస్తవ్యస్త మయ్యే అవకాశమూ ఉంది. అల్పాహారమే కాదు. రాత్రి భోజనం ఆలస్యంగా చేసేవారికీ.. అంటే రాత్రి 10 గంటల తర్వాత తినేవారికీ మధుమేహం ముప్పు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. తక్కువ తక్కువగా రోజుకు ఐదు సార్లు తినేవారికైతే ముప్పు తగ్గుతున్నట్టు బయటపడింది. అలాగే ఎక్కువసేపు ఉపవాసం ఉన్నవారి విషయంలోనూ ఉదయం 8 గంటల్లోపు అల్పాహారం, పెందలాడే రాత్రి భోజనం చేస్తేనే మంచి ఫలితం కనిపిస్తున్నట్టు తేలటం గమనార్హం. రోజులో తొలి ఆహారం ఉదయం 8 గంటల్లోపు, రాత్రి ఆహారం సాయంత్రం 7 లోపు చేస్తే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు వివరిస్తున్నారు. ఇలాంటి ఆహార పద్ధతితో రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్టూ ఐఎస్‌గ్లోబల్ గతంలో నిర్వహించిన అధ్యయనంలోనూ వెల్లడైంది. మొత్తమ్మీద మధుమేహం, ఇతర సమస్యల నివారణకు ఆహారం, జీవ గడియారం, ఆరోగ్యం మధ్య సంబంధం (క్రోనోన్యూట్రిషన్) బలమైన ప్రభావం చూపుతున్నట్టు రుజువవుతోంది.

# పనుల వేగంతో క్యాన్సర్ దూరం!



ఇంటిపని వేగంగా చేస్తున్నారా? షాపింగ్ మాల్‌లో చాలా బరువైన వస్తువులను మోస్తున్నారా? వేగంగా నడుస్తున్నారా? పిల్లలతో కలిసి వేగంగా ఆడుకుంటున్నారా? అయితే క్యాన్సర్ ముప్పు తగ్గించుకున్నట్టే. రోజులో అప్పుడప్పుడూ వేగంగా చేసే ఇలాంటి పనులకు సిడ్నీ యూనివర్సిటీ పరిశోధకులు పెట్టిన పేరు 'విగరస్ ఇంటర్‌మిటెంట్ లైఫ్‌స్టైల్ ఫిజికల్ యాక్టివిటీ' (వీఐఎల్‌పీఏ) అని. ఒక నిమిషం కన్నా తక్కువసేపు వేగంగా చేసే ఇలాంటి శారీరక శ్రమతో కొన్ని క్యాన్సర్ల ముప్పు 32% వరకూ తగ్గుతుండటం గమనార్హం. వ్యాయామం చేయని 22వేల మంది ఆరోగ్య సమాచారాన్ని ఏడేళ్ల పాటు పరిశీలించి శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు. శారీరక శ్రమ చేయనివారితో పోలిస్తే దీన్ని కేవలం నాలుగు నిమిషాల సేపు చేసినా క్యాన్సర్ ముప్పు గణనీయంగా తగ్గుతున్నట్టు కనుగొన్నారు. అత్యధిక వేగంగా చేసే హెచ్‌ఐఐటీ వ్యాయామ పద్ధతి సూత్రాలు వీఐఎల్‌పీకీ కొంతవరకు వర్తిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. వ్యాయామం, శారీరక శ్రమ చేయనివారికి రొమ్ము, ఎండోమెట్రియల్, పెద్దపేగు క్యాన్సర్ల వంటి వాటి ముప్పు పెరుగుతున్నట్టు ఇప్పటికే తేలింది. కానీ కాసేపు వేగంగా చేసే పనుల ప్రభావం గురించే తెలియదు. "మధ్యవయసు వారిలో చాలామంది రోజూ వ్యాయామం చేయరు. ఇది క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తుంది. అయితే నడక, మెట్లు ఎక్కటం వంటి వాటిని గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల రాకతో అప్రయత్నంగా వేగంగా చేసే పనులను గుర్తించటం సాధ్యమైంది. ఇలాంటి పనులను కొద్ది నిమిషాల సేపు చేసినా మొత్తంగా క్యాన్సర్ల ముప్పు 18% వరకు తగ్గుతోంది. కొన్ని క్యాన్సర్ల ముప్పు 32% వరకూ తగ్గుతోంది" అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ స్టమటకిస్ చెబుతున్నారు. అప్పుడప్పుడూ వేగంగా చేసే పనులతో శరీర కదలికల వేగం పుంజుకోవటం, గుండె-ఊపిరితిత్తుల సామర్థ్యం ఇనుమడించటం క్యాన్సర్ ముప్పు తగ్గటానికి దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. శారీరక శ్రమతో ఇన్సులిన్ గ్రాహకత్వం పెరగటం, దీర్ఘకాల వాపు ప్రక్రియ తగ్గటమూ దీనికి కారణం కావొచ్చని అనుకుంటున్నారు. ఇంటి పనులు వేగంగా చేయటానికి ఎలాంటి ఖర్చూ కాదని, అందువల్ల క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవటానికిది ఒక సాధనంగా ఉపయోగపడగలదని భావిస్తున్నారు.

# గర్భిణుల పోషణ లేమిపిల్లలకు శాపం!



పెద్దయ్యాక జబ్బుల గురించి ఆలోచిస్తుంటాం గానీ దీనికి బీజం మనం తల్లి కడుపులో ఉండగానే పడుతుంది. ముఖ్యంగా తల్లికి సరైన పోషణ లభించకపోతే పుట్టబోయే పిల్లల మీద గణనీయ మైన ప్రభావం చూపుతుంది. అయినా ప్రపంచవ్యాప్తంగా గర్భిణుల్లో పోషణలేమి ఇప్పటికీ సమస్యగానే మిగిలిపోయింది. గర్భధారణ సమయంలో తగినంత పీచు పదార్థం తీసుకోకపోతే పిల్లల మెదడులోని నాడుల పనితీరు దెబ్బతింటున్నట్టు జంతువుల మీద నిర్వహించిన అధ్యయ నాలు చెబుతున్నాయి. మనుషుల్లోనూ ఇలాంటి ప్రభావమే కనిపిస్తున్నట్టు జపాన్ పరిశోధకులు తొలిసారిగా గుర్తించారు. గర్భధారణ సమయంలో పోషణలేమికీ పిల్లల్లో నాడుల అభివృద్ధి ఆలస్యం కావటానికీ సంబంధం ఉంటున్నట్టు తమ అధ్యయనం మరోసారి నిరూపించిందని యూనివర్సిటీ ఆఫ్ యమనషికి చెందిన డాక్టర్ కునియో మియాకే చెబుతున్నారు. గర్భిణుల్లో చాలామంది ఆహారం ద్వారా తగినంత పీచు పదార్థం తినరు. దీని ప్రభావం ఎలా ఉంటుందో గుర్తించటానికి పరిశోధకులు ప్రయత్నించారు. గర్భధారణ సమయంలో పీచు తగినంత తిన్న వారికి పుట్టిన పిల్లలతో పోలిస్తే, పీచు తక్కువగా తిన్నవారికి పుట్టినవారి మెదడులోని ఆయా భాగాల్లో నాడుల అభివృద్ధి మందగించినట్టు తేలింది. వీరిలో సంభాషణ, సమస్యల పరిష్కారం, వ్యక్తి-సామాజిక నైపుణ్యాలు తక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. శరీరంలో చిన్న కండరాల సమన్వయంతో పాటు పెద్ద అవయవ భాగాల కదలికలు, సమన్వయం కూడా ఆలస్యమైనట్టు గుర్తించారు. పిల్లల్లో ముమ్ముందు సమస్యలు తలెత్తకుండా చూసుకోవటానికి గర్భిణులకు ఆహారం విషయంలో మార్గదర్శకాలు అవసరమని ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.



## గత సినిమాలు మైమరించేలా

### త్రివిక్రమ్, అల్లుఅర్జున్ సినిమా : నాగఅశ్వీన్

వివాదాల సంగతెలావున్నా.. కెరీర్ పరంగా మాత్రం గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్నారు అల్లు అర్జున్. ఆయన సృష్టించబోయే రికార్డే ప్రస్తుత మూవీ మేకర్లందరి టార్గెట్ అయ్యేలా ఉంది. ఏదేమైనా 'పుష్ప 2'తో దేశం మొత్తం తనపైపు చూసేలా చేశారు బన్నీ. ఆయన చేయబోయే సినిమాపై కూడా అంచనాలు ఇప్పుడు భారీ స్థాయిలో ఉంటాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తన తాజా ప్రాజెక్ట్‌ని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు బన్నీ. కాగా, ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది? రిలీజ్ ఎప్పుడు? ఇవి ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నలు. వీటికి ఆ చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవలే సమాధానమిచ్చారు. త్వరలోనే బన్నీ, త్రివిక్రమ్ కూర్చుని పాత్ర గెటప్, సినిమా సెటప్ విషయాలు చర్చిస్తారు. 2025 మధ్యలో ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ చేస్తాం. 2026 చివర్లో రిలీజ్ చేస్తాం. మారిన బన్నీ ఇమేజ్ దృష్ట్యా.. పానిండియా స్థాయిలో సినిమా ఉంటుంది. బన్నీ, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన గత చిత్రాలను మరిపించేలా అద్భుతమైన కథతో ఈ సినిమాను నిర్మించనున్నాం' అని తెలిపారు.





## తన వల్లే ఈ అవకాశం వచ్చింది

### సమంతకు థాంక్స్ చెప్పిన కీర్తిసురేష్

మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్ . తెలుగు, తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. వరుణ్ ధావన్‌తో కలిసి 'బేబీ జాన్' చిత్రంలో నటించింది. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 'బేబీ జాన్' చిత్రంలో అవకాశం గురించి మహానటి తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. స్టార్ నటి సమంత కారణంగానే తనకు 'బేబీ జాన్' చిత్రంలో నటించే గొప్ప అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామ్‌కు థ్యాంక్స్ చెప్పింది. 'బేబీ జాన్' చిత్రం 'తెరి' సినిమాకు రీమేక్‌గా రూపొందించిన విషయం తెలిసిందే. దీని తమిళ వెర్షన్‌లో హీరోయిన్‌గా సామ్ నటించింది. ఈ చిత్రం హిందీ రీమేక్ చేయాలని భావించిన చిత్ర బృందం సమంతను సంప్రదించగా.. సామ్ తన పేరును సూచించిందని కీర్తి సురేశ్ తాజాగా వెల్లడించింది. తమిళంలో సమంత పోషించిన పాత్రను హిందీలో తాను చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ సినిమాతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి అని పేర్కొంది. ఈ సినిమా కోసం సమంత తన పేరు చెప్పగానే తాను భయపడ్డానని అయితే సమంత తనకు ఎంతో మద్దతు ఇచ్చిందని పేర్కొంది. సమంత ఇచ్చిన ధైర్యంతోనే సినిమాను పూర్తి చేశానని చెప్పుకొచ్చింది. ఈ విషయంలో సమంతకు కీర్తి సురేశ్ కృతజతలు తెలిపింది.

## ఈ ఏడాదిలో ఇదే బెస్ట్ మూవీ.. జాన్వీ కపూర్

తమిళ అగ్ర కథానాయకుడు శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ అమరన్ . ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా వచ్చిన ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. శివ కార్తికేయన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా ఈ చిత్రానికి బాలీవుడ్ స్టార్ నటి జాన్వీకపూర్ రివ్యూ ఇచ్చారు. ఈ ఏడాది 'అమరన్' బెస్ట్ మూవీ అని పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'అమరన్' చిత్రాన్ని చూడటం కాస్త ఆలస్యమైనట్లు చెప్పుకొచ్చారు. ఈ చిత్రంలోని ప్రతీ సన్నివేశం తన హృదయాన్ని కదిలించిందని.. ఒక మంచి సినిమాతో ఈ ఏడాదిని ముగించినట్లు జాన్వీ తన స్టోరీస్‌లో రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.



## మరో వివాదంలో చిక్కుకున్న మంచు ఫ్యామిలీ

మంచు ఫ్యామిలీ మరో వివాదంలో చిక్కుకుంది. మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య జరిగిన ఆస్తి వివాదం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంచలనం సృష్టించాయి. ఆ విషయాలు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్నాయనగా.. మంచు ఫ్యామిలీ మరో వివాదంలో ఇరుక్కుంది. మంచు విష్ణు సిబ్బంది అడవి పందులను వేటాడటం ఇప్పుడు వైరల్‌గా మారింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని అటవీ ప్రాంతంలో మంచు విష్ణు మేనేజర్ కిరణ్ చిట్ట అడవి పందులను వేటాడాడు. వేటాడిన అడవి పందిని ఎలక్ట్రీషియన్ దేవేంద్ర ప్రసాద్ బంధించి తీసుకొచ్చాడు. అడవి పందిని వేటాడి తీసుకెళ్లినట్లు మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషియన్ ప్రసాద్‌పై ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చాయని మంచు మనోజ్ తెలిపారు. వారిద్దరి చర్యలను తప్పుబడుతూ పలుమార్లు అభ్యంతరాలు కూడా వ్యక్తం చేశానని చెప్పారు. అయినప్పటికీ వారిద్దరూ పట్టించుకోకుండా ఇలాగే చేశారని చెప్పారు. ఇదిలా ఉంటే మంచు విష్ణు సిబ్బంది అడవి పందులను బంధించి తీసుకెళ్తున్న వీడియోలు ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వీటిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవి పందులను వేటాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## 2025 లక్కీ ఇయర్ : నిధి అగర్వాల్

వచ్చే ఏడాది ఆడియన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నది అందాలభామ నిధి అగర్వాల్. ఒకే ఏడాది ఇద్దరు సూపర్‌స్టార్లతో రెండు పానిండియా సినిమాల్లో ఆమె మెరవనున్నది. అందులో ఓ సినిమా పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' కాగా, రెండో సినిమా ప్రభాస్ 'రాజా సాబ్'. ఈ సందర్భంగా ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'పవన్ సార్‌తో 'హరిహర వీరమల్లు'లో నటించడం చాలా ఆనందంగా ఉంది. అసలు ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం గర్వకారణం కూడా. ఇక 'రాజా సాబ్'లో ప్రభాస్ సార్‌తో కలిసి నటించడం మరిపోలేని అనుభూతి. సినిమాకోసం టీమ్ మొత్తం డెడికేటెడ్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి. అందుకే 2025 నా లక్కీ ఇయర్. వీటితో పాటు వచ్చే ఏడాది తెలుగు, తమిళంలో మరికొన్ని సర్‌ప్రైజింగ్ మూవీస్‌లో నటిస్తున్నాను. వాటి గురించి త్వరలో తెలియజేస్తా.' అన్నారు నిధి అగర్వాల్.



## ఆ ట్రెండ్‌ను అంగీకరించాల్సిందే..? మోహన్‌లాల్

సీనియర్ హీరోలు తమ చిత్రాల్లో యువ నాయికలతో జోడీ కట్టడం, తెరపై వారితో రొమాన్స్ పండించడం భారతీయ చిత్రసీమలో సాధారణమే. అయితే ఈ ధోరణి పట్ల అసంతృప్తి వ్యక్తం చేసేవాళ్లు చాలా మంది కనిపిస్తారు. అరవై, డబ్బు ఏళ్లు దాటిన హీరోలు కూడా అప్పుడే ఇండస్ట్రీలోకి వచ్చిన యువ కథానాయికలతో ఆడిపాడటం ఏంటనే విమర్శలు కూడా వస్తుంటాయి. తాజాగా వీటిపై మలయాళ అగ్ర హీరో మోహన్‌లాల్ స్పందించారు. చక్కటి ఆరోగ్యం, తెరపై ఫిట్‌గా కనిపిస్తామనే ఆత్మవిశ్వాసం ఉంటే కథానాయకులకు వయసు ఏమాత్రం సమస్య కాబోదని చెప్పారు. స్టార్‌డమ్ సంపాదించుకున్న హీరోలు ఇండస్ట్రీలో చాలా కాలం రాణిస్తారు కాబట్టి ఈ విషయం గురించి ఆలోచించొద్దన్నారు. ఆయన మాట్లాడుతూ 'ఈ ట్రెండ్ ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. ఆరోగ్యం సహకరిస్తే వందేళ్ల వరకైనా నటించొచ్చు. నటీనటులకు పాత్రల ఎంపిక చాలా ప్రధానం. క్యారెక్టర్‌లో కంఫర్టబుల్‌గా ఫీల్ అవడం ముఖ్యమైన అంశం. వీటి ఆధారంగానే తమ పక్కన నటించే వారి గురించి నిర్ణయం తీసుకోవాలి. ప్రేక్షకుల ఆదరణ ఉంటే ఇలాంటి విషయాల గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. ఇటీవలే ఆయన పాన్ ఇండియా ఫాంటసీ చిత్రం 'బరోజ్' ప్రేక్షకుల ముందుకొచ్చింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com